# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 సంచిక: 51 బుధవారం 17-09-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


## కిష్కింధపురి చూసి లోకేష్ కనగరాజ్ ఫోన్..



8లో..

### కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాలకు
## స్వేచ్ఛ కల్పించాలి




- రైతుల ఆదాయం పెరిగేలా పాలసీలలో మార్పులు జరగాలి
- ఆదాయంపై తరుచుగా సర్వే నిర్వహించాలి
- తెలంగాణ విత్తన రంగానికి జాతీయ గుర్తింపు ఇవ్వాలి
- ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలి
- మంత్రి తుమ్మల తుమ్మల నాగేశ్వరరావు

2

### కట్టలు కట్టలుగా
## నగదు పట్టవేత

- విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఇంటిపై ఏసీబీ సోదాలు
- ఆయన బంధువులు, బినామీల ఇళ్లపై కూడా..
- 18 చోట్ల సోదాలు, 200 కోట్ల ఆస్తులు గుర్తింపు!



2

### భక్తుల డబ్బులు
## పెళ్లి మండపాలకు కాదు

- దేవాలయ నిధులతో కల్యాణ మండపాల నిర్మాణంపై వివాదం
- తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు
- హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- నిధులను విద్య, వైద్యం వంటి సేవా కార్యక్రమాలకు వాడాలని సూచన
- నవంబర్ 19న తదుపరి విచారణ జరుపుతామని వెల్లడి




2

## పాల ప్యాకెట్లకే పైసల్లేవు.. 3 కోట్లు ఎక్కడ నుంచి తెస్తాం సార్

- రూ.200, రూ.500తో పూట గడవడమే కష్టంగా ఉంది
- ఒక్కడు బాగుపడితే కుటుంబాన్ని చూసుకుంటాడని ఆశపడ్డం
- డబ్బులు ఇచ్చారని చెప్పడం సరికాదు
- టీజీపీఎస్సీ గ్రూప్–1 ర్యాంకర్ తల్లి ఆవేదన
- సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం

2



## టీజీపీఎస్సీముట్టడించిన తెలంగాణ జాగృతి

- కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి
- పోలీసులు, జాగృతినాయకుల మధ్య వాగ్వాదం
- అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలింపు



2

### తగ్గించిన జీఎస్టీ ప్రయోజనాలు
## ప్రజలకు చేరాలి

- జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు వేల కోట్ల నష్టం
- ఈ నిర్ణయం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలనేదే మా ఉద్దేశం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ట్రేడర్స్ అసోసియేషన్‌తో భేటీ




**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:** వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల సవరణ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ట్రేడర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జీఎస్టీ పన్నుల తగ్గింపు, దాని ప్రయోజనాలు ప్రజలకు ఎలా చేరాలనే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ అందాలని స్పష్టం చేశారు. విధానపరమైన నిర్ణయాలు ఎన్ని తీసుకున్నా.. వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందాలని ఆయన అన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే

మిగతా 2వ పేజీలో..

## వణికించిన క్లౌడ్ బరస్ట్

- కొండచరియలు విరిగిపడి హిమాచల్‌లో ముగ్గురు దుర్మరణం
- వరద నీటిలో కొట్టుకుపోయిన 20కి పైగా బస్సులు, ఇతర వాహనాలు
- ధ్వంసమైన రోడ్లు, ఇళ్లు, దుకాణాలు.. అస్తవ్యస్తమైన జనజీవనం
- సీఎంలతో మాట్లాడిన ప్రధాని మోదీ, అమిత్ షా.. సహాయక చర్యలు ముమ్మరం
- ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రులు, అధికారులు



2



## మెట్రో స్టేషన్‌లో పాస్‌పోర్ట్ సేవలు

- ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో పాస్ పోర్ట్ సేవా కేంద్రం ప్రారంభం
- దేశంలోనే మొట్టమొదటి సారిగా..
- పాస్ పోర్ట్ ఇవ్వడంలో దేశంలోనే హైదరాబాద్ ఐదవ స్థానం
- మెట్రో ఎక్కిన.. దిగిన కనిపించేలా పాస్ పోర్ట్ సేవ కేంద్రం

**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:** ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో పాస్ పోర్ట్ సేవా కేంద్రం ప్రారంభమైంది.. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సేవలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి సారిగా మెట్రో స్టేషన్‌లో పాస్ పోర్ట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.. పాస్ పోర్ట్ ఇవ్వడంలో దేశంలోనే హైదరాబాద్ ఐదవ స్థానంలో ఉందన్నారు.. తెలంగాణలో ఇప్పటి వరకు ఐదు పాస్ పోర్ట్ సేవ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.. తెలంగాణాలో రోజుకు 4500 పాస్ పోర్టులు ఇచ్చే సౌకర్యం ఉంది.. కానీ 1200, 1400 వందలే ఇస్తున్నారని.. దీన్ని విస్తరించాలని సూచించారు.. బయట దేశాలకు వెళ్తే భారతీయులుగా మన గుర్తింపు పాస్ పోర్ట్ అని మంత్రి చెప్పారు. అవసరం ఉన్న లేకున్నా పాస్ పోర్ట్

మిగతా 2వ పేజీలో..

### ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు హైదరాబాద్
## అనువైన నగరం

- 2030 నాటికి ఈవీ బ్యాటరీలకు, పునరుత్పాదక శక్తి సాంకేతికతకు డిమాండ్
- జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్.. స్వయం సమృద్ధికి క్రిటికల్ మినరల్స్ కీలకం
- 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' సెమినార్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:** కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని టీహబ్‌లో నిర్వహించిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్సీఎంఎం) 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' సెమినార్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రసంగించారు. పరిశోధనలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు హైదరాబాద్ అనువైన నగరమని.. ఇది సృజనాత్మకతకు, శాస్త్ర, సాంకేతిక రంగాలకు హబ్ లాంటిదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు, ఉత్పత్తుల సరఫరాలో ఇబ్బందుల నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానం యొక్క ప్రాముఖ్యత పెరిగిందని కిషన్ రెడ్డి అన్నారు. 2030 నాటికి ఈవీ బ్యాటరీలకు, పునరుత్పాదక శక్తి సాంకేతికతకు డిమాండ్ మూడు రెట్లు పెరుగుతుందని, దీనితో క్రిటికల్ మినరల్స్ అవసరం కూడా పెరుగుతుందని ఆయన చెప్పారు. ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్సీఎంఎం కింద ఇప్పటికే దేశంలో 4 ఐఐటీలు, 3 రీసెర్చ్ ల్యాబొరేటరీలను "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు" గా అభివృద్ధి చేశామని కిషన్ రెడ్డి వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ఆత్మనిర్భర్ దేశంగా, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడంలో క్రిటికల్ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన నొక్కి చెప్పారు. అలాగే ప్రధాని మోదీ నాయకత్వంలో గత 10 ఏళ్లుగా గనుల రంగంలో సమూల మార్పులు వచ్చాయని కిషన్ రెడ్డి అన్నారు. చరిత్రలోనే తొలిసారిగా బొగ్గు ఉత్పత్తి, రవాణాలో 1 బిలియన్ టన్నుల లక్ష్యాన్ని

మిగతా 2వ పేజీలో..

### అర్ధరాత్రి నుండి ఆరోగ్యశ్రీ
## సేవలు బంద్

- రాష్ట్రంలోని 323 ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిలిచిపోనున్న సేవలు
- రూ. 1400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్
- బకాయిలు చెల్లించకపోవడంతో భారంగా ఆసుపత్రుల నిర్వహణ
- అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం : నెట్‌వర్క్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్ డాక్టర్ వదిరాజు రాకేష్



2

## కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాలకు
# స్వేచ్ఛ కల్పించాలి

**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:**

కేంద్ర ప్రాయోజిత పథకాలలో రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. చిన్న చిన్న పథకాల కు బదులుగా సమన్వయం చేసి సరళీకృతం చేస్తే రైతులకు ఎక్కువ లబ్ధి చేకూరుతుందని సూచించారు. రైతు ఆదాయం పెరగేలా పాల సీలలో మార్పులు తీసుకురావాలని అన్నారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రబీ అభియాన్ - 2025 వ్యవసాయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా గా గుర్తింపు పొందిందని, దేశానికి అవసరమయ్యే విత్తనాల్లో దాదాపు 60 శాతం తెలంగాణ నుండే సరఫరా అవుతున్నాయన్నారు.20కుపైగా దేశాలకు విత్తనాల ఎగుమతి జరుగుతోందని వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగులో కూడా రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ప్రస్తుతం 1.5 లక్షల హెక్టార్లలో సాగు జరుగుతుండగా, దీన్ని త్వరలో 8 లక్షల హెక్టార్లకు విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబీన్, వేరుశెనగ, మిరప, పసుపు, సిరిధాన్యాలు వంటి పంటలు విస్తృతంగా పండుతున్నాయని, అందులో తాండూరు కంది, చాపట మిరప జీఐ గుర్తింపు పొందాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, రైతు బీమా, ఉచిత 24 గంటల విద్యుత్ సరఫరా, పంట రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీలు వంటి పథకాలతో రైతులకు భద్రత, నమ్మకం కల్పించామని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 2,601 రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తూ దాదాపు 13 లక్షల మంది రైతులు, అందులో 3 లక్షల మహిళా రైతులు నేరుగా శాస్త్రవేత్తలు, అధికారులతో సంప్రదింపులు జరిపేలా అవకాశాలు కల్పించామన్నారు.

రాష్ట్ర అవసరాల నేపథ్యంలో, రబీ సీజన్‌లో యూరియా సహా ఎరువుల సరఫరా జరగాలని, ఎరువుల కొనుగోలులో ఉన్న 25 శాతం పరిమితిని అన్ని పంటలకూ తొలగించాలని, జొన్న, మొక్కజొన్నలను ప్రైస్ సపోర్ట్ స్కీమ్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరారు. పామాయిల్ పై ప్రస్తుతం ఉన్న సబ్సిడీ 33 శాతం నుంచి 50 శాతానికి పెంచి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని, తెలంగాణ విత్తన రంగానికి జాతీయ గుర్తింపు ఇవ్వాలని, ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఎంజీఎన్‌ఆర్ఈజీఏలాగానే రైతుల ఆదాయం పెరుగుతోందా లేదా అన్న దానిపై తరచుగా సర్వేలు చేయాలని కోరారు. సబ్సిడీలతో నైట్రోజన్ ఎరువుల వాడకం పెరిగి భూమిలోని పోషకాల అసమతుల్యత పెరుగుతోందని, ఎరువుల ధరలను సవ్యంగా ఉంచి సమతుల్య పోషకాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. సీడ్ చట్టాన్ని పునఃసమీక్షించి నాణ్యత లేని విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను తీసుకురావాలని కోరారు. పురోగామి విధానాలు, బలమైన పరిశోధన సంబంధాలు, రైతు స్నేహపూర్వక పథకాలు ఉంటే వ్యవసాయం లాభదాయకంగా, బలంగా, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగలిగే రంగంగా మారుతుందన్నారు. కేంద్రం సహకారంతో పాటు జాతీయ స్థాయి సంస్కరణలతో భారత వ్యవసాయాన్ని మరింత సురక్షితంగా మార్చి అందరికీ ఆహార, పోషక భద్రతను అందించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## భక్తుల డబ్బులు పెళ్లి మండపాలకు కాదు

**నేషనల్ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:**

దేవాలయాలకు భక్తులు సమర్పించే కానుకలు, నిధులు కల్యాణ మండపాలు నిర్మించడానికి కాదని సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించరాదని స్పష్టం చేస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చినతీర్పుపై స్టే విధించడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. తమిళనాడులోని ఐదు ప్రముఖ దేవాలయాల నిధులను ఉపయోగించి, వివిధ ప్రాంతాల్లో కల్యాణ మండపాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టులోని మదురై ధర్మాసనం, ఆ ఉత్తర్వులను ఆగస్టు 19న రద్దు చేసింది. అద్దె ప్రాతిపదికన వివాహ వేడుకల కోసం మండపాలు నిర్మించడం అనేది "మత పరమైన కార్యక్రమాల" పరిధిలోకి రాదని తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. "దేవాలయ అభివృద్ధి కోసమో, ఇతర మంచి పనుల కోసమో భక్తులు విరాళాలు ఇస్తారు. అంతేగానీ, కల్యాణ మండపాలు కట్టడానికి కాదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ఒకవేళ ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో వివాహ వేడుక జరుగుతుంటే, అక్కడ అసభ్యకరమైన పాటలు పెడితే అది సరైన విధానం అవుతుందా?" అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ నిధులను విద్య, వైద్య సంస్థల ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేనా కాదా అనేదే ఇక్కడ కీలకమని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పుపై స్టే విధించడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు, ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని తెలిపింది. తదుపరి విచారణను నవంబర్ 19వ తేదీకి వాయిదా వేసింది.

## అర్ధరాత్రి నుండి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:**

తెలంగాణ రాష్ట్రంలో నేటి అర్ధరాత్రి (సెప్టెంబర్ 16) నుంచి ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. నెట్‌వర్క్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్ డాక్టర్ వదిరాజు రాకేష్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 323 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ సేవలు నిలిచిపోనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ విషయమై డాక్టర్ వదిరాజు రాకేష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో ఆసుపత్రుల నిర్వహణ భారంగా మారిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇక ఆసుపత్రుల ప్రధాన డిమాండ్లు చూస్తే.. ఆసుపత్రులకు సంబంధించిన రూ. 1400 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, అలాగే ఆరోగ్యశ్రీ సేవల బిల్లులను 40 రోజుల్లోగా చెల్లించాలని కోరారు. అలాగే ముఖ్యంగా ఆరోగ్యశ్రీ కోర్ కమిటీలో వైద్యులను చేర్చాలని.. తద్వారా ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా చర్చించి పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలుస్తుంది. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే, ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించే అవకాశం లేదని డాక్టర్ రాకేష్ తేల్చి చెప్పారు. ఈ పరిణామం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## వణికించిన క్లౌడ్ బరస్ట్

**నేషనల్ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:**

ఉత్తర భారతంలోని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను క్లౌడ్ బరస్ట్ వణికించింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు ఈ రెండు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ ప్రకృతి బీభత్సానికి హిమాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు మృతి చెందగా, రెండు రాష్ట్రాల్లోనూ భారీ ఆస్తి నష్టం సంభవించింది. వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించి, జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో ఈ వర్షాల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. జిల్లాలోని నిహ్రీ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఒక ఇంటిపై పడటంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, మరో ఇద్దరిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయని జిల్లా ఎస్పీ సాక్షి వర్మ తెలిపారు. ఇక ధర్మపూర్ పట్టణంలోని బస్ స్టాండ్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరద ప్రవాహానికి 20కి పైగా ప్రభుత్వ బస్సులు, ఇతర వాహనాలు కొట్టుకుపోయాయని, సమీపంలోని వర్క్‌షాప్‌లు, పంప్ హౌస్‌లు, దుకాణాలు కూడా ధ్వంసమయ్యాయని ఉప ముఖ్యమంత్రి ముఖేశ్ అగ్నిహోత్రి ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. అటు రాజధాని సిమ్లాలోనూ పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. ఇక, ఉత్తరాఖండ్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. ముఖ్యంగా రాజధాని డెహ్రాడూన్‌లోని సహస్రధార, రాయ్‌పూర్, మాల్దేవతా ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సహస్రధార నది ఉప్పొంగి ప్రవహించడంతో హోటళ్లు, దుకాణాల్లోకి వరద నీరు, బురద చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. మాల్దేవతా ప్రాంతంలో ఏకంగా 100 మీటర్ల పొడవైన రోడ్డు వరద ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకృతి విపత్తుపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వేగంగా స్పందించాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మంగళవారం ఉదయం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, అధికారులతో సమీక్షించారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, రహదారులను పునరుద్ధరించే పనులు ముమ్మరం చేశామని ఆయన తెలిపారు. సహస్రధార నదిలో చిక్కుకుపోయిన ఐదుగురిని రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), పోలీసులు కలిసి రక్షించారని వెల్లడించారు.

# ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు హైదరాబాద్ అనువైన నగరం

మొదటిపేజీ తరువాయి

చేధించామని తెలిపారు. అలాగే, ఆఫ్ షోర్ మినరల్ బ్లాక్స్, ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ బ్లాక్‌లకు సంబంధించి తొలిసారిగా వేలం ప్రక్రియ చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం క్రిటికల్ మినరల్స్‌కు సంబంధించి 6వ విడత వేలం ప్రక్రియ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని.. ఇందులో తెలంగాణతో పాటు పంజాబ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు తొలిసారిగా పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. క్రిటికల్ మినరల్స్‌ను ఉత్పత్తి చేయడానికి, రీసైక్లింగ్‌ను బలోపేతం చేయడానికి రూ. 1500 కోట్లతో ప్రారంభించిన కొత్త పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, దీని వల్ల 70 వేల ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. మైన్స్ అండ్ మినరల్స్ చట్టంలో సవరణలు చేయడం వల్ల లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి లోతైన ఖనిజాల తవ్వకం సాధ్యమైందని కిషన్ రెడ్డి వివరించారు. విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు నిధుల కోసం నేషనల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్‌ను ఉపయోగిస్తున్నామని, ఇప్పటికే కాబిల్ అర్జెంటీనాలో లిథియం బ్లాకులను సొంతం చేసుకుని తవ్వకాలు ప్రారంభించిందని తెలిపారు. జపాన్, పెరూ వంటి దేశాలతో ఖనిజాల వెలికితీతకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్, జై కిసాన్', అటల్ బిహారీ వాజ్‌పేయి 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్' నినాదాలను గుర్తుచేస్తూ, ప్రధాని మోదీ 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్' నినాదాన్ని ఇచ్చారని కిషన్ రెడ్డి చెప్పారు. ఇది "వికసిత భారత్" సాధించే దిశగా పరిశోధనలు, సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టడం, ఒకే మిషన్‌లో 103 ఉపగ్రహాలను ప్రయోగించడం వంటి విజయాలు సాధించామని, ఇలాంటి స్ఫూర్తితోనే సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కృషి చేయాలని ఆయన కోరారు. చివరగా, 'డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్స్' ప్రారంభించి పదేళ్లు పూర్తైన సందర్భంగా గనుల కార్మికులకు, స్థానికులకు లబ్ధి చేకూర్చాలని, వారి గౌరవం, భద్రత కోసం బొగ్గు గనుల కార్మికులకు రూ. 1 కోటి వరకు బీమా కవరేజ్ అందిస్తున్నామని కిషన్ రెడ్డి తెలియజేశారు.

## తగ్గించిన జీఎస్టీ ప్రయోజనాలు
# ప్రజలకు చేరాలి

మొదటిపేజీ తరువాయి



తీసుకున్నామని తెలిపారు. మధ్యతరగతి ప్రజలు, రైతులకు ఉపయోగపడే వస్తువులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గించిన వస్తువుల ధరల వివరాలను వ్యాపారులు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. షోరూమ్‌ల ముందు కచ్చితంగా రేట్ల ధర పట్టికలు పెట్టాలని.. అప్పుడే, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయంపై అవగాహన వస్తుందని ఆయన కోరారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశంపైన అయినా చర్చించడానికి సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. వ్యాపారస్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, తక్షణమే స్పందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో వ్యాపారులు కలిసి పనిచేసి జీఎస్టీ సవరణ ప్రయోజనాలను ప్రజలకు చేర్చాలని ఆయన కోరారు.

# మెట్రో స్టేషన్‌లో పాస్‌పోర్ట్ సేవలు

మొదటిపేజీ తరువాయి



తీసుకోవాలని యువతకు సూచించారు. అత్యవసర సమయంలో రావాలంటే వచ్చేది కాదని.. అందుకే ముందే తీసుకోవాలన్నారు. మెట్రో ఎక్కిన.. దిగిన పాస్ పోర్ట్ సేవ కేంద్రం కనబడుతుందన్నారు. పాస్ పోర్ట్ వెరిఫికేషన్ లో ఎటువంటి జాప్యం ఉండదని స్పష్టం చేశారు.. వెరిఫికేషన్ లో ఆలస్యం చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. మరోవైపు.. ఈ అంశంపై హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. "సౌత్ హైదరాబాద్ కు ఈరోజు మంచి శుభవార్త.. సౌత్ హైదరాబాద్ కు పాస్ పోర్ట్ సేవ కేంద్రం అందుబాటులోకి వచ్చింది.. ఈ సేవ కేంద్రం కోసం నేను అనేక సార్లు ప్రభుత్వాన్ని సంప్రదించాను.. ఒకే చోట పాస్ పోర్ట్ సేవలు పొందాలంటే ఇబ్బంది ఉండేది.. గతంలో చెన్నై.. బెంగళూరు.. లక్నో లలోనే పాస్ పోర్ట్ ఆఫీసులు ఉండేవి.. ఉమ్మడి ఏపీ ఉన్నప్పుడు పాస్ పోర్ట్ కావాలంటే చెన్నై వెళ్లాల్సి వచ్చేది.. మన సిటీకి పాస్ పోర్ట్ రీజనల్ ఆఫీస్ వచ్చింది.. సేవ కేంద్రాలను విస్తరిస్తున్నాం.. వీలైనంత వరకు ఈ పాస్ పోర్ట్ ను సంప్రదించండి.. వీలైనంత త్వరగా పాస్ పోర్ట్ ఎంక్వైరీ పూర్తి చేయండని.. లోకల్ పోలీసులను కూడా కోరుతున్నా.." అని వ్యాఖ్యానించారు.



## టీజీపీఎస్సీ ముట్టడించిన
# తెలంగాణ జాగృతి

**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**

గ్రూప్ - 1 అభ్యర్థులకు న్యాయం చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని జాగృతి నాయకులు, కార్యకర్తలు రెండు విడుతలుగా ముట్టడించారు. ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, జాగృతి నేతల మధ్య వాగ్వావాదం జరిగింది. ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులకు కార్యకర్తలు ఎక్కడి నుంచి వచ్చి ముట్టడిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక లోపాలతో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించిన విషయాన్ని రాష్ట్ర హైకోర్టు ఎత్తి చూపిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలకు అన్యాయం చేసే జీవో నం.29 నుంచి మొదలుకొని ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ, ఫలితాల ప్రకటన, మెయిన్స్ పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన అన్నింటా ప్రభుత్వ వైఫల్యం చెందిందన్నారు. నిరుద్యోగులకు అన్యాయం చేసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు గ్రూప్ 1 పోస్టులను అమ్మకానికి పెట్టినట్టుగా ప్రచారం జరుగుతోందన్నారు. ప్రభుత్వం పంతానికి పోకుండా నిరుద్యోగులతో చర్చలు జరిపి వారు కోరుకున్నట్టుగా తదుపరి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మ బలికి నిలువునా ప్రభుత్వం నిరుద్యోగులను ముంచిందని జాగృతి నాయకులు మండిపడ్డారు. అసెంబ్లీలో జాబ్ లెస్ బోగస్ క్యాలెండర్ ప్రకటించి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు ఒక్క కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి దానికి అనుగుణంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

**జాగృతి నాయకుల అరెస్టు..**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి నాయకులను పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు ఠాణాలకు తరలించారు. అరెస్టు సమయంలో జరిగిన తోపులాటలో పలువురు జాగృతి నాయకులకు గాయాలయ్యాయి. అరెస్టు చేసిన తెలంగాణ జాగృతి నాయకులను నాంపల్లి, అబిడ్స్, గాంధీ నగర్, అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.




# కట్టలు కట్టలుగా నగదు పట్టివేత

- **విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఇంటిపై ఏసీబీ సోదాలు**
- **ఆయన బంధువులు, బినామీల ఇళ్లపై కూడా..**
- **18 చోట్ల సోదాలు, 200 కోట్ల ఆస్తులు గుర్తింపు!**

**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:**

ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అంబేద్కర్ ఇల్లు, ఆయన బంధువులు, బినామీల ఇళ్లపై అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమ ఆస్తులు భారీగా బయటపడ్డాయి. ఏసీబీ బృందాలు ఒకేసారి 18 చోట్ల సోదాలు నిర్వహించాయి. ఇందుకు సంబంధించి ఇంకా అంబేద్కర్, ఆయన బినామీలు, బంధువులకు సంబంధించిన ఇళ్లలో సోదాలు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు దాదాపు రూ. 200 కోట్లకు పైగా విలువైన ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ప్రతి పనికి లంచం తీసుకునే అలవాటు అంబేద్కర్‌కు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. గచ్చిబౌలిలో ఉన్న అంబేద్కర్ బినామీ సతీష్ ఇంట్లో ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ. 2 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, గచ్చిబౌలిలో ఒక ఖరీదైన భవనాన్ని కూడా గుర్తించారు. అంతేకాకుండా, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో అంబేద్కర్‌కు 10 ఎకరాల వ్యవసాయ భూమి, వెయ్యి గజాల్లో ఫామ్‌హౌస్ ఉన్నట్లుగా అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు 15 బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో లభించిన వ్యవసాయ భూముల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు భాగం పంచుకున్నారనే దానిపై విచారణ కొనసాగుతోంది.

# పాల ప్యాకెట్లకే పైసల్లేవు.. 3 కోట్లు ఎక్కడ నుంచి తెస్తాం సార్

**తెలంగాణ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**

గ్రూప్ -1 మెయిన్స్ పేపర్లు రీవాల్యుయేషన్ చేయాలని, లేనిపక్షంలో ఎగ్జామ్ మళ్లీ నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవలతీర్పు వెలువరించింది. అయితే రూ.3 కోట్లు ఇచ్చి గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారని, ఇది రూ.1700 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపణలు రావడంతో ర్యాంకర్ల తల్లిదండ్రులు సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. ఓ ర్యాంకర్ తల్లి మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఏడుగురు బిడ్డలు, ఓ బాబు ఉన్నారని.. కూలీనాలి చేసుకుని వాళ్లను ప్రయోజకులు చేశానన్నారు. కొందరు పిల్లల్ని పనికి పంపించి ఒకర్ని చదివిపించి ఉద్యోగం వచ్చేందుకు కష్టపడ్డాం. పాల ప్యాకెట్‌కు పైసలు లేవంటే మీరు రూ.3 కోట్లు ఇచ్చారంటున్నారు. ఎక్కడి నుంచి తెస్తాం సార్. రూ.200, రూ.500తో పూట గడవడమే కష్టంగా ఉంది. ఒక్కడు బాగుపడితే కుటుంబాన్ని చూసుకుంటాడని ఆశలు పెట్టుకుంటే డబ్బులు ఇచ్చారని చెప్పడం సరికాదు. ఇప్పటికే రెండుసార్లు పరీక్షలు రద్దు చేశారు. మూడోసారి పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తారా ? వాళ్ల ఏజ్ అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పండుగలకు ఇంటికి రాకుండా ప్రిపేర్ అయ్యాడు..

గ్రూప్ 1 57 ర్యాంకర్ ఉదయ్ కిరణ్ తల్లి లలిత మీడియాతో మాట్లాడుతూ.. మారుమూల పల్లె నుంచి వచ్చిన వాళ్లం. అతికష్టమ్మీద పిల్లలను తెలుగు మీడియం నుంచి ఇంగ్లీష్ మీడియం చదువులు చెప్పించాం. గత మూడేళ్లుగా దసరా పండుగలకు మా అబ్బాయి ఇంటికి కూడా రాకుండా ప్రిపేర్ అయ్యాడు. కోచింగ్ సెంటర్లో ఉండి ఎంతో పట్టుదలతో చదివి గ్రూప్ 1 ర్యాంక్ సాధించాడు. గతంలో పరీక్షలు నిర్వహించి రద్దు చేసినా, మానసికంగా సిద్ధమై మళ్లీ ఉద్యోగం సాధించాడు. ప్రతి సారి జాబ్స్ ఫలితాలపై దుష్ప్రచారం జరుగుతోంది. ప్రిలిమ్స్, మెయిన్స్ ఫలితాల తరువాత సైలెంట్ గా ఉన్న వాళ్లు ఇప్పుడు గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన తరువాత అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆరోపణలు చేస్తున్నారు. కష్టపడి చదివించారు. ఈ బాబును చూసి నేర్చుకోవాలి అని స్థానికంగా చెబుతుంటారు. జాబ్ తెచ్చుకుని కుర్చీలో కూర్చోక ముందే ఉద్యోగాన్ని లాగేసుకుంటున్నారు. మళ్లీ పరీక్షలు నిర్వహించడం అంటే కింద పడిన అన్నాన్ని మళ్లీ తీసుకుని తినడమే. మళ్లీ ఎగ్జామ్ రాస్తే ఎంపికైనా అది కరెక్ట్ అన్న నమ్మకం ఎవరికైనా ఉంటుందా. రూ.3 కోట్లు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. కనీసం రూ.30 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నవాళ్లు, అంత డబ్బు చూసిన వాళ్లు ఇక్కడ లేరు. ర్యాంక్ తెచ్చుకుని మా బాబు రోడ్డున పడినట్లుగా పరిస్థితి ఉంది. మరో ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ.. ఫలితాలు వచ్చి జాబ్ ఎక్కక ముందే గ్రూప్ 1 ర్యాంకర్లపై అసత్యాలు ప్రచారం చేయడం సరికాదు. కోచింగ్ లేకుండా బుక్స్ చదివి జాబ్ తెచ్చుకున్న వారిని డబ్బులతో జాబ్ కొన్నారని ఆరోపించడం ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు.కోదాడ పక్కన పల్లెటూరు నుంచి ర్యాంకర్ తల్లి సీత కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పంపి పిల్లల్ని చదివించాను. నా కూతురు కష్టపడి చదివి జాబ్ తెచ్చుకుంటే రూ.3 కోట్లు ఆరోపణలతో జీవితాలు నాశనం చేస్తున్నారు. మాకు ఎవరూ పెద్దలు తెలవదు, రికమండేషన్లు చేయలేం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని కోరారు. మరో ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ.. కష్టపడి గ్రూప్ 1 ర్యాంక్ తెచ్చుకుంటే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. చదువుకున్న రాజకీయ నాయకులు కూడా చదువుకోని వాళ్లలాగ మాట్లాడుతున్నారు. పిల్లల భవిష్యత్ ఏమవుతుందని తల్లిదండ్రులు ఎంతో ఆందోళన చెందుతున్నారు. జాబ్ సాధించిన వాళ్లను తప్పు చేసినవాళ్లుగా చిత్రీకరిస్తున్నారు



# హక్కులు అమలు చేస్తూ, సర్క్యులర్ జారీ చెయ్యండి

- **ఏఐటియుసి నేత సమ్మయ్య డిమాండ్**

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ. (సెప్టెంబర్ 16):**



సింగరేణి రామగుండం ఓసీపీ.3 ప్రాజెక్టు, బేస్ వర్క్ షాప్, లలో మంగళవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ద్వారా సమావేశాలు జరిగాయి. ఉదయం ప్రాజెక్టు కృషి భవన్ ఆవరణ లో, బేస్ వర్క్ షాప్ ఆవరణలో స్తానిక కమిటీలు ఏర్పాటు చేసిన సమావేశాల్లో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ముస్క సమ్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల ప్రధానమైన సమస్యలపై సంస్థ సిఎండి స్తాయి, డైరెక్టర్ (పా) స్తాయి సమావేశాల్లో హక్కులపై, సమస్యలపై చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి సొంతింటి పథకం అమలు, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రిఫండ్ ఇవ్వడం, మారు పేరు కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించడం, ఎన్ మైనస్ వన్ ప్లేడేల గూర్చి, డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగాలు కల్పించడం, పెండింగ్ లో ఉన్న క్యాడర్ స్కీములను మెరుగుపరచడం, మొదలగు హక్కుల అమలు చేసేందుకు తగు సర్క్యూలర్లను జారీ చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే కార్మికులు ఎంతగానో ఎదురు చూస్తున్న వాస్తవ లాభాలు, అందులో నుండి వాటాను ప్రకటించక పోవడాన్ని నిరసిస్తూ.. సెప్టెంబర్ 12న జరగాల్సిన స్ట్రక్చర్ సమావేశాన్ని తమ యూనియన్ బహిస్కరించినట్లు వివరించారు. ఒకవైపు ఈ అంశాలపై కార్మికులు ఆందోళనలు చెందుతుండగా, మరోవైపు కంపెనీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై పారిశ్రామిక ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపించారు. కార్మికులను ఆందోళనకు గురిచేస్తే తమ యూనియన్ చూస్తూ ఊరుకోదని, పోరాటం మాకు కొత్తేమీ కావని, పలు రూపాల్లో పోరాట కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి వాస్తవ లాభాలు ప్రకటించి, అందులో నుండి 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని, అలాగే పెండింగ్ లోఉన్న కార్మిక సమస్యల పరిష్కారానికి సర్కులర్లను వెంటనే జారీ చేయాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జరగబోయే పరిణామాలకు యాజమన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన యాజమాన్యాన్ని హెచ్చరించారు. కొన్ని సంఘాలు పని కట్టుకొని ఏఐటీయూసీ యూనియన్ను బదనాం చేయాలని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కార్మికులు వాస్తవాలు గ్రహించాలని కోరారు. వీటన్నింటిపై సెప్టెంబర్ 19న అన్ని ఏరియాల జిఎం కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని, తద్వారా కంపెనీ యాజమాన్యానిక బుద్ధి వచ్చేలా చేయాలని ఆయన కార్మికులను కోరారు. వేరువేరుగా జరిగిన ఈ సమావేశంలో కోరడం కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్.ప్రకాష్, కేంద్ర కమిటీ కార్యదర్శి కె. రాజా రత్నం, ఏరియా కార్యదర్శి జిగురు రవీందర్, ఉపాధ్యక్షులు గారు, బి. అన్నారావు, నాయకులు సాంబశివరావు, మోట పలుకుల మహేందర్, కుమారస్వామి, రవీందర్, శ్రీనివాస్, sa రమేష్, సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ,క్యాంటీన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కొయ్యాడ వేణు, గాజుల వీరస్వామి, బండారి మల్లేష్, పుల్లూరి శ్రీనివాస్, వి.హత్య, లక్ష్మణ్, శ్రీనివాస్, ఎంబడి పోచన్న,ఆనంద్, అశోక్ గౌడ్,మహమ్మద్ అలీ, శాంసన్ చింతల మురళి, నల్ల మధు, ఇమ్రాన్ పాషా, వహిద్, అజయ్, వెంకటేష్, బోర్ల కుమారస్వామి, పీవీ. రెడ్డి విష్ణువర్ధన్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రజకుల అభివృద్ధికి కృషి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :**

హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో గ్రేటర్ హైదరాబాద్ రజకుల అభివృద్ధి ,సంక్షేమం పై బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ అధ్యక్షత ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో గ్రేటర్ హైదరాబాద్ లో ధోబీ ఘాట్ ల నిర్వహణ, అభివృద్ధి ,అలాగే మౌలిక సదుపాయాల కల్పన పై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ధోబీ ఘాట్ల శాశ్వత స్థలాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి మంజూరైన నిధులను వాడుకొని త్వరిత గతిన పనులు చేపట్టాలని కోరారు. రజక సంఘం ప్రతినిధుల విజ్ఞప్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్ గారిని ఆదేశించారు. ఈ సభలో షాద్ నగర్ ఎమ్మెల్యే , ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు మాట్లాడుతూ... ఎన్నో ఏండ్లుంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరి చందన,బీసీ వెల్ఫేర్ కమిషనర్ బాల మాయ దేవి,తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ ఎండీ చంద్రశేఖర్,అదనపు సంచాలకులు ఆశయ్య, ఆర్డీఓ రామకృష్ణ,రజక సంఘం ప్రతినిధి నరసింహ,కోట్ల శ్రీనివాస్,సంపత్, తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు

- **రాయదుర్గంలో అత్యాధునిక సదుపాయాలతో సరికొత్త పాస్‌పోర్టు సేవా కేంద్రం**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :**

కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాస్ పోర్ట్ సేవా కేంద్రంను ఐటీ & పరిశ్రమల, వాణిజ్యం, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ కే జై శ్రీనివాస జాయింట్ సెక్రటరీ , సిపిఓ, రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ శ్రీమతి స్నేహజ ఐఎఫ్ఎస్ తో కలిసి పాల్గొని ప్రారంభించారు పీఏసీ చైర్మన్ గాంధీ.

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ... అన్ని హంగులతో సకల సౌకర్యాలతో పాస్‌పోర్టు సేవా కేంద్రం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని శేరిలింగంపల్లి ప్రజలకు పాస్‌పోర్టుకు సంబంధిత సేవలు మరింత చేరువలో, వేగవంతంగా అందుబాటులోకి వస్తాయని, ఈ చక్కటి అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని తెలియచేసారు అన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పాస్‌పోర్ట్ అనేది భారతీయుల అంతర్జాతీయ గుర్తింపు పత్రం అని, అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఏర్పడే ముందే యువత పాస్‌పోర్ట్ తీసుకోవాలని సూచించారు. కొత్త భవనంలో రోజుకు 1000 స్లాట్లు అందుబాటులో ఉండడం వల్ల సేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కేంద్రం శేరిలింగంపల్లి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించడంతో పాటు, అత్యవసర అవసరాల సమయంలో వేగవంతమైన సేవలు అందించేలా రూపుదిద్దుకుందన్నారు. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో గత 11 ఏళ్లలో పాస్‌పోర్టు సేవలను దేశ ప్రజలకు చేరువ చేయడానికి అనేక సంస్కరణలు చేపట్టారు. 2014లో దేశవ్యాప్తంగా 110 పాస్‌పోర్టు సేవా కేంద్రాలుండగా, నేడు ఆ సంఖ్య 550కు పైగా పెరగడం ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగించిందని, పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను సులభతరం చేసి వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఇంతకుముందు టోలీచౌకీ షేక్‌పేట్‌లోని ఆనంద్ సిలికాన్ చిప్ భవనంలో కొనసాగుతున్న పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఇప్పుడు రాయదుర్గం సిరి బిల్డింగ్‌లోకి మార్చారు. అత్యాధునిక సదుపాయాలతో మంగళవారం ప్రారంభమైన ఈ కేంద్రం ఇకపై పూర్తిస్థాయిలో ప్రజలకు అన్ని సేవలను అందిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

## అమరవీరుల స్థూపం భూమి పూజను విజయవంతం చేయాలి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :**




బుధవారం ఉదయం 9.00 గంటలకు అమర వీరుల స్తుపానికి భూమిపూజ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్నది అని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కోదండరాం పాల్గొంటునట్లు తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్రాం రెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ఉద్యమకారులందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలనీ ఆయన కోరారు.

ఈ సందర్భంగా ఉద్యమకారులను ప్రోత్సహిస్తూ ముందుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## వైష్లవ్య దీపం

యే జల్, యే జంగల్,
యే జమీన్ హమారాహై యే దగాకోర్, బడాచోర్, రజాకర్
కోన్ హైరే తూ? అంటూ నిరంకుశ నిజాం పాలనపై
పగబట్టిన, పడగెత్తిన తెలంగాణ సాయుధ సమరమది!

భూస్వాముల గుండెల్లో
భూకంపం పుట్టించి భూమికొరకు, భుక్తికొరకు,
బానిసజాతి విముక్తి కొరకు పిడికిలెత్తి, గుత్పవట్టి,
ఒడిసెల శేతవట్టి
వడివడిగా కదంతొక్కి
కదలెత్తిన రైతాంగ కదనమిది!

గడీల గోడల మీద,
కమానుల కొనకొమ్ముల మీద విప్లవాల సూర్యుళ్ళై,
మండే అగ్గిగోళాలై ఎలిగి
వెనుకబడి, తిరుగబడిన
తిరగబడి, దొరల వెనుకబడిన
అణగారిన ఆక్రందనల పోరు ఇది!

రౌడీమూకలపై, రజాకార్ రాకాసులపై,
జమీందార్ జలగలపై జాగీర్దార్ జులూములపై
చేయీ చేయీ సంఘటితమై, రాయీ రాయీ ఆయుధమై
వెట్టి చేసే మట్టిమనుషులు గడ్డపారలైన ఉద్యమమిది!

తుపాకి తూటాలకు చెదరలేదు
వెయ్యి ఉరులకు వెరువలేదు
రజాకార్ సైన్యానికి లొంగలేదు
తలలు తెగివడ్డా బెదరలేదు
చలిచీమల రోషమై,
పురికొసల బలగమై
రైతాంగ సాయుధ పోరాటమైన
చెరిపేస్తే చెరగని చరిత్ర ఇది
మలిపేస్తే మలగని తెలంగాణ వైష్లవ్య దీపమిది

(సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా)

**డాక్టర్ చింతల రాకేశ్ భవాని**
**తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్**
**కవి, రచయిత , గాయకులు**
**సినీ సాహిత్య పరిశోధకులు**
**సెల్: 9246607551**



## ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- **అభినదించిన పీఏసీ చైర్మన్ గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :**

హఫీజ్పెట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్ గాంధీని వివేకానంద నగర్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలవతో సన్మానించి, అభినదించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ... ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేయడం జరిగినది. అదేవిధంగా ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని,కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయి అని , ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని,నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులందరికి ఎల్లవేళాలో అందుబాటులో ఉంటూ కాలనీ సమస్యల పై స్పందిస్తూ ,ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధి కి పాటుపడాలని ఒక ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దే క్రమం లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియచేసారు. జల ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని,అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తానని, మౌలిక వసతుల కల్పనకై పెద్దపీట వేస్తానని, కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యం తో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ అధ్యక్షులు విఘ్నేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ కిషన్, ట్రెజరర్ సాంబశివ రెడ్డి, లీగల్ సెక్రెటరీ వేణు గోపాల్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ నర్సింలు మరియు ప్యానల్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్,టీచర్స్ మీటింగ్

- **ముఖ్య అతిథిగా హాజరు అయినా వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్**

**జర్నలిస్ట్ డైరీ కోడంగల్ (సెప్టెంబర్ 16):**

వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గం లోని దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ రోజు కళాశాల ప్రిన్సిపాల్ టీ వసంత అధ్యక్షతన పేరెంట్స్,టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ హనుమంతు రిటైర్డ్ హెడ్మాస్టర్ వీరన్న ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నోడల్ అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులే ఉన్నత విజయాలను సాధించారని, ప్రభుత్వ కళాశాలలో చదివే మీరు కూడా ఉన్నత విజయాలను సాధించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.చదువుకునే తమ పిల్లలపట్ల తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఉండాలని,ప్రతిరోజూ తమ పిల్లలను ఇంటిదగ్గర చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు మాట్లాడుతు విద్యార్థుల తల్లిదండ్రులు కనీసం నెలకి ఒక్కసారైనా కాలేజికి వచ్చి అధ్యాపకులను,ప్రిన్సిపాల్ ను కలిసి తమ పిల్లల చదువు గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల జీవిత అభివృద్ధిలో తల్లిదండ్రులే ప్రధాన పాత్ర వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ హెడ్మాస్టర్ వీరన్న మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిపి ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినరు అని కళాశాల యాజమాన్యాన్ని కొనియాడారు.కళాశాల అభివృద్ధి తనవంతుగా సహాయసహకారాలు అందిస్తానన్నారు.సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన బుక్స్ మన లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయని,విద్యార్థులు లైబ్రరీకి వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దౌల్తాబాద్ లైబ్రేరియన్ శివ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ టి.వసంత విద్య యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ,విద్యార్థులకు మార్గ నిర్దేశనం చేశారు.విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయాన్ని నేర్పించడంలో మా కాలేజ్ యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ కాలేజ్ కి పంపించాలని,పిల్లల చదువుపై నిఘా పెట్టాలని, వీలైనంత వరకు పిల్లలను ఫోన్ కి దూరంగా ఉంచాలని తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యాపకులు ముఖ్య అతిథులను సన్మానించడం జరిగింది. అనంతరం కళాశాల అధ్యాపకులు,విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్ఎంఎస్ ప్లాంటు సందర్శించిన కంట్రోలర్లు

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలని. (సెప్టెంబర్ 16):**

సింగరేణి రామగుండం మూడవ ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంటును మంగళవారం ఎక్స్ప్లోజివ్స్ కంట్రోలర్లు మన్ప్రీత్ సింగ్ మానస్, రామేశ్వర్ హెచ్ బకార్ లు సందర్శించారు. ఉదయం ఇక్కడికి వచ్చిన వారు ముందుగా ప్లాంటు ఆవరణలో మొక్కలు నాటారు. తదనంతరం వారిని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర్ రావు ను వెంట ఉండి ఎస్ఎంఎస్ ప్లాంటు లో సందర్శించి, ప్లాంట్ సామర్థ్యం పెంచడం కొరకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు.

రామగుండం రీజియన్ లో గల (ఓసీపీ) ఉపరితల గనులకు మట్టి (ఓ.బి) వెలికితీత కొరకు ఉపయోగిస్తున్న పేలుడు పదార్థాలు, ప్రస్తుతం ఈ ప్లాంట్ నుండే సంవత్సరానికి 30 వేల టన్నులను సరఫరా చేయడం జరుగుతుందని, ఇంకా దాని అవసరం నిమిత్తం సామర్థ్యాన్ని సంవత్సరానికి 60 వేల టన్నులను సరఫరా చేయడం కొరకు అవసరమైన అభివృద్ధి (విస్తరణ) పనులు చేపట్టడం జరుగుతుందని అందుకు కావలసిన అనుమతులను కోరినట్లు, ఏరియా జీఎం సుధాకర్ రావు వారికి వివరించారు. అనంతరం అలాగే ప్లాంటు విస్తరణ కొరకు ఇప్పటి వరకు చేపట్టిన, ప్రస్తుతం చేపడుతున్న బాయిలర్స్, టాంకర్స్, గోదాములు మొదలగు పనులను కంట్రోలర్లకు తెలిపారు.

ప్లాంటును పూర్తిగా పరిశీలించిన కంట్రోలర్లు మాట్లాడుతూ.. ఎక్స్ప్లోజివ్స్ సామర్థ్యం పెంచడానికి తగిన ఏర్పాట్లను చేస్తూ, అందుకు కావలసిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇక వారితో పాటు ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వి ఫాంటింగ్, మేనేజర్ పి.శరవణన్ తదితరులు సందర్శించారు.

## నేడు షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా హెల్త్ క్యాంప్

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :**




బుధవారము 17వ తారీకు ఉదయము 9:00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో " స్వస్థ నారి శక్తివంత కుటుంబ అభియాన్" స్త్రీలకు మరియు పిల్లలకు అన్ని రకాల వ్యాధులపై, అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించబడు తుంది అని డాక్టర్ విజయలక్ష్మి మరియు ఆస్పత్రి సూపర్డెంట్ విష్ణువర్ధన్ తెలియజేశారు. ఈ క్యాంపు ప్రారంభోత్సవానికి ఉదయం 9:30 గంటలకు ముఖ్య అతిథులుగా షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ వస్తున్నారని డాక్టర్ వి విజయలక్ష్మి తెలియజేశారు. ఈ మెగా హెల్త్ క్యాంపు లో అన్ని రకాల వ్యాధులతో పాటు, రక్త పరీక్షలు మరియు మూత్ర పరీక్షలు, రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహించబడును అని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు.

ఈ క్యాంపులో ప్రత్యేకంగా స్త్రీలకు మరియు పిల్లలకు పరీక్షలు నిర్వహించడం ముఖ్య ఉద్దేశం " మహిళా ఆరోగ్యమే కుటుంబ బలం అని, ఆరోగ్యమైన తల్లి ఆరోగ్యవంతమైన పిల్లలు, కుటుంబం, సమాజం, శక్తివంతం కావడం అని ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి మూలం అని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఇట్టి మెగా హెల్త్ క్యాంపును షాద్నగర్ పట్టణ మహిళలు మరియు పిల్లలందరూ కూడా ఇట్టి మెగా హెల్త్ క్యాంపును సద్వినియోగము చేసుకోవలసిందిగా, క్యాంపు కు వచ్చే వారు తప్పకుండా ఆధార్ కార్డు లేదా అబా కార్డు తీసుకొని రావాలని షాద్నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి మరియు షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియచేశారు.

# బీసీల హక్కులపై రాజకీయ మోసం

భారతదేశంలో జనాభా పరంగా బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, వారి సంక్షేమం, హక్కులు, రిజర్వేషన్ల విషయంలో జరుగుతున్న అన్యాయాలు ఒక దీర్ఘకాలిక విషాదకరమైన వాస్తవం. దేశ జనాభాలో సుమారు 50 శాతానికి పైగా బీసీలు ఉన్నారని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వారికి కేటాయించబడిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు ఎప్పుడూ సరిగా అమలుకావు. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు. ఇది రాజకీయ వ్యవస్థలోని లోపాలు, చట్టపరమైన అడ్డంకులు, నాయకుల స్వార్థపరత్వం కలిసి సృష్టించిన ఒక మోసపూరిత వలయం. బీసీలు సమాజంలో వెనుకబడిన వర్గాలుగా గుర్తించబడినప్పటికీ, వారి ఉద్ధరణ కోసం రూపొందించిన విధానాలు ఎప్పుడూ పూర్తి స్థాయిలో అమలు కావు. బదులుగా రాజకీయ పార్టీలు వాటిని ఓటు బ్యాంక్‌గా మాత్రమే ఉపయోగిస్తున్నాయి. ఇది ఒక సమగ్రమైన విశ్లేషణ ద్వారా స్పష్టమవుతుంది. చట్టాలు, ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు బీసీలకు ఎలా అన్యాయం చేస్తున్నారో.

ముందుగా చట్టపరమైన కోణాన్ని పరిశీలిస్తే, భారత రాజ్యాంగం సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లను అనుమతిస్తుంది, కానీ సుప్రీం కోర్టు "ఇంద్ర సాహ్నీ" కేసులో 50 శాతం పరిమితిని నిర్దేశించింది. మండల్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఓబీసీలకు (అంటే బీసీలకు) 27 శాతం రిజర్వేషన్ కేటాయించబడింది. కానీ ఇది జనాభా శాతానికి సరిపడదు. ఈ పరిమితి వల్ల రాష్ట్రాలు బీసీలకు అధిక రిజర్వేషన్లు కల్పించాలనుకున్నా చేయలేకపోతున్నాయి. ఉదాహరణకు, తెలంగాణలో బీసీల జనాభా 56 శాతం ఉన్నప్పటికీ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంది.

ఇది చట్టపరమైన మోసం లాంటిది, ఎందుకంటే సుప్రీం కోర్టు మార్గదర్శకాలు రిజర్వేషన్లను 50 శాతానికి మించకూడదని చెబుతున్నాయి. కానీ, ఇది బీసీల హక్కులను కాలరాస్తోంది. మరోవైపు, ఈడబ్ల్యూఎస్ (ఎకనామికలీ వీకర్ సెక్షన్) రిజర్వేషన్ ద్వారా ఉన్నత వర్గాలకు 10 శాతం కేటాయించడం బీసీలకు మరింత అన్యాయం చేస్తుంది, ఎందుకంటే ఇది వారి షేర్ ను తగ్గిస్తుంది.

ప్రభుత్వాల పరంగా చూస్తే, బీసీల సంక్షేమం కోసం ప్రకటించిన పథకాలు ఎప్పుడూ పూర్తిగా అమలు కావు. ఉదాహరణకు, బీసీ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు తరచుగా రద్దు చేయబడతాయి లేదా దుర్వినియోగం అవుతాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించింది, కానీ అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించి బీసీలకు అన్యాయం చేస్తోంది.



ఇది స్పష్టమైన మోసం, ఎందుకంటే బీసీల రిజర్వేషన్‌ను ఇతర మైనారిటీలకు డైవర్ట్ చేయడం వల్ల వారి హక్కులు హరించబడుతున్నాయి. అలాగే, తెలుగు రాష్ట్రాల్లో వివిధ పార్టీల ప్రభుత్వ పాలనలలో బీసీలపై దాడులు, తప్పుడు కేసులు, రిజర్వేషన్ తగ్గింపు జరిగాయి.

ప్రభుత్వాలు బీసీలకు స్కాలర్‌షిప్స్, ఉద్యోగాలు, విద్యా అవకాశాలు ఇస్తామని చెబుతాయి, కానీ అమలులో లోపాలు, క్రీమీ లేయర్ నిబంధనలు వల్ల చాలామంది బీసీలు లబ్ధి పొందలేకపోతున్నారు. జాతీయ న్యాయ కళాశాలల్లో బీసీ రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు.
ఇది ప్రభుత్వాల బ్యూరోక్రటిక్ హైజాక్‌గా చూడవచ్చు, ఎందుకంటే సామాజిక న్యాయానికి బదులు రాజకీయ లాభాలు ప్రధానమవుతున్నాయి. రాజకీయ పార్టీలు, నాయకుల వల్ల బీసీలకు జరుగుతున్న మోసాలు మరింత తీవ్రమైనవి. పార్టీలు ఎన్నికల సమయంలో బీసీలకు అధిక రిజర్వేషన్లు, సంక్షేమం హామీలు ఇస్తాయి, కానీ అధికారంలోకి వచ్చాక మరచిపోతాయి. తెలంగాణలో కాంగ్రెస్ 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని చెప్పింది, కానీ అమలు చేయకుండా కుట్రలు చేస్తోంది. బీజేపీ బీసీలను ప్రోత్సహిస్తామని చెబుతుంది, కానీ బిల్లులను అడ్డుకుంటోందని ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ వంటి పార్టీలు సుప్రీం కోర్టులో 60 శాతం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ కేసులు వేస్తాయి, కానీ పబ్లిక్‌గా మద్దతు చూపిస్తాయి.

బీసీ నాయకులను పార్టీలు ఉపయోగించి, వారిని ముందుంచి ఓట్లు గుంజుతాయి, కానీ అధికార స్థానాల్లో ఉన్నత వర్గాలకే ప్రాధాన్యం ఇస్తాయి. ఇది రాజకీయ మోసం యొక్క సారాంశం: బీసీలను ఓటు బ్యాంక్‌గా చూడటం, కానీ వారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడం. ఫలితంగా, బీసీలు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యంలో వెనుకబడిపోతున్నారు. ఫేక్ సర్టిఫికెట్లు, రిజర్వేషన్ దుర్వినియోగం వంటి సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి, ఇవి ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే సాధ్యమవుతున్నాయి.

ఈ మోసాల వల్ల బీసీల సంక్షేమం తీవ్రంగా దెబ్బతింటోంది. విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల చాలామంది యువత అవకాశాలు కోల్పోతోంది. ఉద్యోగాల్లో కూడా బీసీల షేరు తగ్గుతోంది, ఎందుకంటే క్రీమీ లేయర్ నిబంధనలు వల్ల పేద బీసీలు మాత్రమే లబ్ధి పొందాలి, కానీ అమలు లోపాలు వల్ల ఉన్నత వర్గాలు దుర్వినియోగం చేస్తున్నాయి.
రాజకీయంగా కూడా బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదు; వారు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, అధికార స్థానాలు ఇతర వర్గాల చేతుల్లోనే ఉంటున్నాయి. ఇది సామాజిక విభజనను పెంచుతుంది, రిజర్వేషన్ సిస్టమ్‌ను విమర్శిస్తున్న వారు దీన్ని కుల గుర్తింపులను పెంచుతుందని చెబుతున్నారు. కానీ, వాస్తవం ఏమిటంటే, రిజర్వేషన్లు సరిగా అమలు కాకపోతే బీసీలు శాశ్వతంగా వెనుకబడిపోతారు.
చివరిగా, ఈ విశ్లేషణలో స్పష్టమవుతున్నది ఏమిటంటే, బీసీల హక్కులు రాజకీయ మోసాలకు బలవుతున్నాయి. చట్టాలు మార్చాలి, ప్రభుత్వాలు అమలు చేయాలి, పార్టీలు హామీలను నెరవేర్చాలి. లేకపోతే, జనాభా బలం ఉన్నప్పటికీ బీసీలు సమాజంలో అణగారిన వర్గంగానే మిగిలిపోతారు. ఇది కేవలం సమస్య కాదు, ఇది ఒక రాజకీయ కుట్ర, దీన్ని బీసీలు ఐక్యంగా ఎదుర్కోవాలి.

**డాక్టర్, కోలాహలం రామ్ కిశోర్,**
**9849328496**

# సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు విద్రోహదినమే




సెప్టెంబర్ 17ను తెలంగాణకు విమోచన దినోత్సవం అని, భారత్‌లో విలీనమైన రోజని, తెలంగాణ ప్రజలకు విద్రోహం జరిగిన రోజు అని చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది. చరిత్రలో పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి, ప్రాణాలర్పించిన కమ్యూనిస్టుల పాత్రను కనుమరుగుచేసే కుట్రలు జరుగుతునేఉన్నాయి. వాస్తవ చరిత్రను వక్రీకరించి, వక్రభాష్యాలు చెప్పి నేటి తరం తెలంగాణ ప్రజల మనసులను కలుషితం చేస్తున్నాయి. ప్రజలు తమ గత చరిత్రను సరైన విధంగా తెలుసుకున్నప్పుడు, వర్తమానంలో ఏం చేయాలో భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో నిర్ణయించుకుంటారు. కానీ నేడు 1948 సెప్టెంబర్ 17 కేంద్రంగా ప్రజలు ఏ చరిత్రను సృష్టించుకున్నారో, ఏ పోరాటాలను నిర్మించుకొని భవిష్యత్తును కలలుగన్నారో అది ఉన్నది ఉన్నట్టుగా నేడు పాలకులు, పాలకవర్గ పార్టీలు చెప్పడం లేదు. ప్రజల వీరోచిత పోరాటాల చరిత్ర కూడా ప్రచారంలో ఉండాలి. లేదంటే పాలకవర్గాలు చెప్పే తప్పుడు చరిత్రనే అసలైన చరిత్రగా మిగిలిపోతుంది. అదే నిజమని నమ్మే ప్రమాదం ఉంటుంది. కొందరు విలీనం అని, మరికొందరు విమోచనమని, ఇంకొందరు స్వాతంత్రం అని, తమ స్వార్థ రాజకీయ కార్యాచరణను మొదలుపెట్టారు. వారి వారి స్వలాభం కోసం ప్రజల చరిత్రను మభ్య పెట్టే పనిలో ఉన్నాయి. ఒకడు ఈ పోరాటాన్ని హిందూ ముస్లిం మతాల గొడవులుగా మనల్ని విభజించే కుట్ర , అందులో భాగమే రజాకార్ ఫైల్స్ సినిమా, సరిగ్గా ఇక్కడే మనం మన గత చరిత్రను అర్థం చేసుకోవాలి.
ఈ చారిత్రాత్మక దినాన్ని తమ పార్టీ త్యాగాల ఖాతాలో వేసుకునేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. వాస్తవంగా జరిగింది ఏమిటి?

1948కి ముందు భారతదేశంలో 568 సంస్థానాలు ఉన్నాయి. ఈ అన్ని సంస్థానాల్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలన ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉంది. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలన అంతమైంది. ఈ 568 సంస్థానాల్లో ఒక నాలుగు తప్ప మిగతావన్నీ యూనియన్ ప్రభుత్వంలో విలీనమయ్యాయి. ఈ నాలుగు సంస్థానాలు నిజాం, జమ్మూకాశ్మీర్, జునాగర్, త్రిపుర, ఇవి నాటి యూనియన్ ప్రభుత్వంలో విలీనం అవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేయలేదు. కానీ నెహ్రూ ప్రభుత్వం వీటిని కలుపుకోవడానికి తీవ్రప్రయత్నం చేసింది. హైదరాబాద్ సంస్థానాన్ని నైజాం పరిపాలించేవాడు. నాటి నిజాం రాష్ట్రంలో 16 జిల్లాలు. ఇది బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు నజరాణాలు, పన్నులు చెల్లిస్తూ వారి తాబేదారులుగా కొనసాగుతూ వచ్చింది. నైజాం పాలనలో హైదరాబాద్ సంస్థాన ప్రజలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొన్నారు. నైజాం రాజు. తెలంగాణ ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకోవడం, అధిక పన్నులను గుంజడం, హత్యలు, అత్యాచారాలు చేయడం, స్త్రీలను నగ్నంగా బతుకమ్మ ఆడించడం చేశాడు. శారీరకంగా, మానసికంగా, భౌతికంగా దాడి చేయడం, నిత్యం జరుగుతూ ఉండేవి. ప్రజలను పీడించడం కోసం నైజాం రాజు తన సంస్థానం అంతటా జాగీర్దారులను, జమీందారులను, భూస్వాములను, దేశముఖ్‌లను, దొరలను తన తాబేదారులుగా నియమించుకున్నాడు. నైజాం నవాబు రజాకారులతో ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పరచుకొని ప్రజలపై నిత్యం దాడులు చేస్తుండేవాడు. వీరు హిందూ, ముస్లింతోపాటు అన్ని మతాలలోని ఉన్నత వర్గాలకు, దోపిడి వర్గాలకు రక్షణ కవచంగానూ, అన్ని మతాలలోని పేద ప్రజలను హింసించే వారిగా దోపిడీ చేసేవారిగానూ ఉండేవారు. వీరి దోపిడీని వ్యతిరేకించే వారి ఊర్లను రాత్రికి రాత్రి తగలబెట్టడం ప్రజల ధన, మాన ప్రాణాలను దోచేయడం నిత్యం జరుగుతూ ఉండేది.

దీనికి వ్యతిరేకంగా ప్రజలు ప్రారంభంలో ఆంధ్ర జన సంఘం పేరిట పోరాడారు. అది 1930 నాడు వచ్చేసరికి ఆంధ్ర మహాసభ పేరుతో ఉద్యమించారు. ఈ ఆంధ్ర మహాసభనే తర్వాత కాలంలో కమ్యూనిస్టు పార్టీగా అవతరించింది. వెట్టి చాకిరి, అధిక శిస్తు వసూళ్లకు వ్యతిరేకంగా దున్నేవాడిదే భూమి నినాదంగా ఆంధ్ర మహాసభ పని చేసింది. అది 1946కు వచ్చేనాటికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా మారింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రపంచ చరిత్రలోనే గొప్ప ప్రాముఖ్యత ఉంది. భూమి తల్లి ఒడిలో తమ చెమటను చిందించి పసిడి సిరులను పండించే మట్టి మనుషుల చేత బందూక్ పట్టించింది. దొరలు, భూస్వాములపై యుద్ధాన్ని ప్రకటించింది. ఈ పోరాటంలో వేలాది మంది యోధులు తమ జీవితాలను అర్పించారు. షేక్ బందగి, దొడ్డి కొమరయ్య, షోయబుల్లాఖాన్ లాంటి ఎందరో వీరులు నాటి పోరాటంలో తమ ప్రాణాలను అర్పించారు. విసునూరు రామచంద్రారెడ్డి ఆగడాలకు వ్యతిరేకంగా చాకలి అయిలమ్మ నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం జరిగింది. తెలంగాణలోని నల్గొండ జిల్లాలో మొదలైన ఈ పోరాటం మొత్తం నైజాం రాజ్యం అంతటా విస్తరించింది. ఈ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూములను ప్రజలు సొంతం చేసుకున్నారు. 3000 గ్రామాల్లో నైజాం అధికారానికి దీటుగా ప్రజారాజ్యాలను నెలకొల్పుకున్నారు. దొరలు, భూస్వాములు, జాగిర్దారుల చేతుల్లో ఉన్న భూమి అంతా వాటి కమ్యూనిస్టు పార్టీ గ్రామ సభలు నిర్వహించి భూమిలేని ప్రజలకు పంచి పెట్టింది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా నైజాం రాజు తన పాలన కొనసాగించలేకపోయాడు. నైజాం రాజు అన్ని రకాలుగా బలహీనమైపోయాడు. కమ్యూనిస్టులు పూర్తిగా తమ అధీనంలోకి తెలంగాణాను తీసుకునే సమయం. ఈ పోరాటం దేశవ్యాప్తంగా అంటుకొని ఎక్కడ ప్రజలు భూస్వాములు మీద తిరగబడతారో అని అలోచించిన నాటి ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' పేరుతో నిజాం నవాబు సహకారంతో దండయాత్ర చేసింది. వాస్తవానికి నిజాం నవాబు అప్పటికే జరిగిన ప్రజా పోరాటాల వల్ల బలహీనమైన కారణంగా నాటి నెహ్రూ పటేల్ సైన్యాలు చేసిన ఒక్కరోజులోనే లొంగిపోయాడు. భారత సైన్యం నిజాం నవాబు లక్ష్యంగా దండయాత్ర చేస్తే తాను లొంగిపోయిన తర్వాత కూడా సైన్యం దురాక్రమణ కొనసాగింది. దాదాపు 600 రోజులు వీరు తెలంగాణలోని ప్రతి పల్లెలో దురాక్రమణలను కొనసాగిస్తూ అరాచకం సృష్టించారు. ప్రజలను, విప్లవకారులను అనేక మందిని చెట్లకు కట్టేసి పిట్టల్ని కాల్చి చంపినట్టు చంపారు. అంతేకాదు నిజాం నవాబుకు 'రాజ్ ప్రముఖ్' అనే బిరుదు ఇచ్చి కోటిన్నర రూపాయలను నజరానాగా ఇచ్చింది. ప్రజలను చిత్రహింసలు పెట్టిన ఖాసీం రజ్వీ పాకిస్తాన్ పారిపోవడానికి సహకరించారు. ఇదంతా నెహ్రూ నైజాం నవాబ్ కుమ్మక్కులో భాగంగా జరిగిన తతంగం. నెహ్రూ పటేల్ సైన్యాలు ఆ తరువాత కమ్యూనిస్టుల కేంద్రంగా దాడులు చేసింది. అనేకమంది ప్రజలను ఊచకోత కోశారు. 4000 మంది కమ్యూనిస్టు విప్లవకారులను చంపివేశారు. కమ్యూనిస్టులు పంచి పెట్టిన భూమిని తిరిగి భూస్వాములకు అప్పచెప్పారు.( ఇప్పుడు ఆ భూస్వాములే నేడు రాజకీయ నాయకులైనారు. సినీ నిర్మాతలైనారు. బడా వ్యాపార వెయ్యాలైనారు. ఆ భూస్వాములే చరిత్రను వక్రీకరిస్తున్నారు.) అలాంటప్పుడు ఇది ఏ రకంగా విలీనం, విమోచనం, స్వతంత్రం అవుతుంది.
ప్రధానంగా హిందూ, ముస్లింల మధ్య జరిగిన గొడవగా బీజేపీ దీన్ని సృష్టిస్తోంది. నిజాం నవాబు ముస్లిం అయినా తన కింద పని చేసిన భూస్వాములు, జాగదారులు, దేశ్ ముఖ్‌లు హిందూ మతంలోని ఉన్నత వర్ణాల వారే. వీరిద్దరూ కలిసి అన్ని మతాలలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజల మీద దాడులు చేశారు. అలాంటప్పుడు ఇది వీరు చెబుతున్నట్లు విమోచనం ఎలా అవుతుంది? నిజాం నవాబు 1947 కన్నా ముందే సామంత రాజుగా, బ్రిటిష్ పాలకవర్గాలకు తాబేదారుగా పనిచేస్తున్నాడు. అలాంటప్పుడు దీనిని విలీనం, స్వతంత్రం అనలేము. దీనికి సంబంధించి బీజేపీది మతోన్మాదాన్ని రెచ్చగొట్టే వైఖరి కాగా, మిగతా పార్టీలు అవకాశవాదంతో చరిత్రను వక్రీకరిస్తున్నాయి. నాడు మనం సాధించుకున్న హక్కులను, భూములను నిజాం నవాబు బూచిగా చూపెట్టి నెహ్రూ, పటేల్ సైన్యాలు హరించివేశాయి.. దీనికి వ్యతిరేకంగా నిలబడిన ప్రజలను, కమ్యూనిస్టులను ఊచకోత కోసాయి.
నాటి తెలంగాణ సాయుధ పోరాటం అనవాళ్లు తెలంగాణలో ఏ పల్లెకు వెళ్లినా నేటికీ సజీవంగా మనకు సాక్షాత్కారిస్తాయి. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కొనసాగింపు ఇష్టం లేని వాళ్ళు, ప్రజలను మభ్య పెట్టి రకరకాలైన వాదనలను తెరమీదకు తీసుకొస్తున్నారు. చరిత్రను చరిత్రగా ఉంచితేనే మంచిది. ఒకానొక చారిత్రక సందర్భంలో ప్రజలు తమ చరిత్ర గురించి తెలుసుకున్నప్పుడు భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో వారే నిర్ణయించుకుంటారు. అందుకే ఇంతటి మహోజ్వల చరిత్రకు వక్రభాశ్యాలు చెబుతున్నారు. అయినా అంతిమంగా ప్రజలే చరిత్ర నిర్మాతలు, వారి చరిత్రను వారే నిర్మించుకుంటారు.

**విలీనమూ లేదు.. విమోచన అంతకంటే లేదు!**

1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో విలీనమైనట్లు కనిపించినా, అది అసంపూర్ణమే. నిజాం ప్రభువుకు తగిన గౌరవమే దక్కింది. ఆయనకు ఎలాంటి శిక్షా విధించలేదు. ఆయన అరాచకాలు కూడా కొనసాగాయి. విమోచనం జరిగింది, అనుకుంటే నిజాం ఇక్కడి నుండి పారిపోవాలి లేదంటే అతని అధికారాలు, ఆస్తులు జప్తు చేయబడాలి. చేసిన దుర్మార్గాలకు గాను శిక్ష అనుభవించాలి. కానీ అలాంటివేమి జరగలేదు. భారత ప్రభుత్వానికి నిజాంకు మధ్య యథాస్థితి కొనసాగించే ఒప్పందం మాత్రమే కుదిరింది. సర్ఫేఖాస్ భూములు ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. ఏడవ నిజాం నవాబు ప్రజలను పీడించి కూడబెట్టిన బంగారం, నగలు, వజ్రాలు ఇతర దేశాలకు స్వేచ్ఛగా తరలించబడ్డాయి. అంతేకాదు 1850 జనవరి నుండి 1956 అక్టోబర్ వరకు రాజ్ ప్రముఖ్‌గా రాజభవన్‌లోనే ఉండి అధికారం చలాయించారు. ఆపరేషన్ పోలో తర్వాత1971 వరకూ సంవత్సరానికి 50 లక్షలు రాజభరణంగా నిజాంకు చెల్లించారు. వీటికి పన్ను మినహాయింపు ఇచ్చారు. గ్రామాలలో 1948 నాటికి ప్రజల తిరుగుబాటు పెరిగి, కమ్యూనిస్టు పార్టీ బలపడడం భారత ప్రభుత్వం గమనించింది. దీనికి తోడు దున్నే వాడిదే భూమి ప్రాతిపదికగా 10 లక్షల ఎకరాలు ప్రజల స్వాధీనం అయ్యింది. 3000 గ్రామాలలో గ్రామ రాజ్య కమిటీలు ఏర్పడ్డాయి. దీనిని ప్రమాదంగా భావించిన భారత ప్రభుత్వం (నాటి కాంగ్రెస్ పార్టీ) నిజాంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుమించి విలీనం జరగలేదు. విమోచన అంతకంటే జరగలేదు. అందుకే 1948 సెప్టెంబర్ 17లో జరిగింది విద్రోహమే.

**- పినపాక ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్, కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ**

# తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవం

**నైజాంకు వ్యతిరేక సాయుధ పోరాటం**

బ్రిటిష్ పాలనలోనే భారత దేశంలో 500 పైగా ఫ్యూడల్ సంస్థానాలు కొనసాగుతున్నాయి. అందులో ఒకటి నిజాం పాలకుడుగా హైదరాబాద్ సంస్థానం ఉన్నది. నిజాం నిరంకుశత్వానికి ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో 1946 నుండి 1951 వరకు తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగింది.
దోపిడికి అణచివేతకు వివక్షతకు గురి అవుతున్న శ్రామిక ప్రజలు దున్నేవానికి భూమి నినాదంగా భూమి భుక్తి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో గొప్ప పోరాట ఐక్యత ప్రదర్శించినారు.
తెలంగాణ నిరంకుశ ఫ్యూడల్ పాలకుడైన నైజాముకు వ్యతిరేకంగా , నిజాంకు దళారిలైన హిందూ అగ్ర కుల భూస్వాముల అధిపత్యాన్ని కూల్చివేస్తూ తెలంగాణ రైతాంగం 3000 గ్రామ రాజ్యాలు స్థాపించినారు.10 లక్షల ఎకరాల భూములను భూస్వాముల నుండి ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉద్యమంలో 3 వేల మంది కమ్యునిస్ట్ యోధులు అమరులు అయినారు.
తెలంగాణ సాయుధ పోరాటం ఒక కులానికో ఒక మతానికో వ్యతిరేకమైన పోరాటం కాదు. అన్ని కులాల్లోని అన్ని మతాల్లోని పీడిత ప్రజలు ఐక్యంగా భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా భూస్వామ్య ప్రభువైన నైజాంకు వ్యతిరేకంగా ఒక్కటైన వర్గ పోరాట తిరుగుబాటు.

**విలీనం అంటే నైజాంతో రాజీ**

బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో భారత బూర్జువా వర్గం రాజీ ఒప్పందాలతో 1947 ఆగస్టు 15 స్వాతంత్రం ప్రకటించబడింది.నెహ్రూ పటేల్ నాయకత్వంలోని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం ఇండియాలో విలీనం కాకుండా ప్రత్యేక రాజ్యంగానే కొనసాగుతామంటున్న నిజాం రాజ్యంపై సెప్టెంబర్ 13 నుండి 17 వరకు ఆపరేషన్ పోలో పేరుతో సైనిక దాడిని నిర్వహించింది. ఇదే కాలం నాటికి తెలంగాణ సాయుధ పోరాటం ఉవ్వెత్తున కొనసాగుతూ నైజామును చుట్టుముట్టి నిజాం సైనికులైన రజాకార్లను దెబ్బతీస్తూ పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్న పరిస్థితి కొనసాగుతున్నది. ప్రజా తెలంగాణ విముక్తి చేరువలో ఉన్నది.
నిజాం కొనసాగిస్తున్న అణచివేత పై సుదీర్ఘకాలం మౌనంగా ఉన్న కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం అకస్మాత్తుగా నాటకీయంగా హైదరాబాద్ పై కొనసాగించిన మిలటరీ దాడి కుట్రపూరితమైంది. కేంద్ర ప్రభుత్వం నిజాం రాజుతో కుమ్ముక్కుతో కూడిన నాటకీయమైన దాడి మాత్రమేనని నిజాముకు ఇచ్చిన బిరుదులు, భరణాలు,ఇతర మద్దతు తెలియజేస్తున్నవి.
పటేల్ యూనియన్ సైన్యాలు భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టు ప్రజలను గెరిల్లాలను చంపడం, అణచివేయడం ద్వారా వీరి కుమ్ముక్కు బహిర్గతమైంది. దున్నేవానికి భూమి కోసం పోరాడుతున్న ఉద్యమాన్ని అణిచివేసి భూస్వాముల భూముల రక్షణ కొనసాగించిన పటేల్ ,నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ విధానాలు దున్నేవానికి భూమి కోసం విముక్తి కోసం పోరాడిన ప్రజలకు వ్యతిరేకమైనవి.
నైజాం రాజ్యంలోని కరుడు గట్టిన భూస్వామ్య అధికారం నుండి బూర్జువా నాయకత్వం లోని భూస్వామ్య పెట్టుబడి దారీ వర్గాలకే అధికారం చట్టబద్ధం చేయడమే తెలంగాణ విలీన ప్రక్రియ. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని రక్తపుటేరుల్లో ముంచి భారత పాలకవర్గాలు తెలంగాణను విలీనం చేసుకున్నారు.విలీనం అంటే భూస్వాములు పెట్టుబడిదారులు కుమ్ముక్కుగా మారింది.తెలంగాణా లక్షలాది ప్రజల పై పటేల్ సైన్యం జరిపిన మారణకాండను కీర్తించే బూర్జువా భూస్వామ్య వర్గాల ద్రోహాన్ని విలీన దినము అని కీర్తించడంగా మారిపోయింది.


**ప్రజలపై ఊచకోతే విమోచన దినమా?**

భూస్వామ్య వర్గాలకు బ్రిటిష్ వలస వాదులందరికి ఆర్ఎస్ఎస్( బిజెపి) పూర్తిగా నమ్మకమైన బానిస గిరి చేసింది. వివిధ మతాలకు చెందినభూస్వాములకు సామ్రాజ్యవాదులకు తమ సేవలు అందించడంలో బిజెపికి మతం అడ్డు రాలేదు.కానీ విచిత్రంగా బిజెపి పటేల్ సైన్యాలు నిజాంతో జరిగిన కుమ్ముక్కును ముస్లిం విమోచనగా పేర్కొంటారు.
నిరంకుశ నైజాంకు బలమైన మద్దతుదారులు జమీందారులు జాగిర్దారులైన విసునూరు రామచంద్రారెడ్డి లాంటి హిందూ మతములోని అగ్ర కుల భూస్వాములే . ముస్లిం హిందూ పాలకుల ఐక్య దోపిడీకి మత అడ్డంకులు ఏమీ లేవు. వారు దోపిడీ చేయడానికి హిందూ ముస్లిం వివక్షత ఏమి లేదు. ఈ ప్రజా ఉద్యమంలో కులమత విభేదాలు లేని ఐక్య పోరాటం కొనసాగి దొడ్డి కొమరయ్య, బందగి, షోయబుల్లఖాన్, ఐలమ్మఆరుట్ల రామచంద్రారెడ్డి భీమ్ రెడ్డి నరసింహారెడ్డి బందగి లాంటి వివిధ కులాల వివిధ మతాల ప్రజలు వీరులు అమరులైనారు. కులమత బేధాలు లేని గొప్ప వర్గ పోరాటంపై ముస్లిం విమోచన పోరాటం అని ప్రచారం చేయడం కుట్ర కాదా?
ఆనాటి పాలకులు ముస్లిం హిందూ భూస్వాములుగా దానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రజలు హిందూ ముస్లిం ప్రజలు అయితే బిజెపికి మత విమోచనము ఎలా అవుతుంది?
చరిత్రను వక్రీకరించి కృత్రిమమైన కట్టు కథలు అల్లడం బిజెపి మత ఉన్మాదంతో కూడుకున్న సంకుచితమైన రాజకీయాలు కావా?

**సాయుధ పోరాట విరమణ అనంతర దేశ పరిస్థితి**

గడిచిన 78 యేండ్లలో ప్రపంచంలో దేశంలో, తెలంగాణలో అనేక ముఖ్యమైన మార్పులు జరిగినవి. 1947 ఆగస్టు స్వాతంత్ర అనంతరం భారత బూర్జువా రాజకీయ వ్యవస్థ పరిపాలన ప్రారంభమైంది. చట్టసభలు కోర్టులు జైలు పోలీసు మిలటరీ పరిపాలన విభాగాలు వగైరా రూపంలో భారత రాజ్యం బలోపేతం అయింది. బూర్జువా రాజ్యాధికారం ద్వారా 550 కి పైగా నిజాం లాంటి ఫ్యూడల్ సంస్థానాలను రద్దు చేయడం జరిగింది.
అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య వ్యవస్థను రాడికల్ గా మార్చడానికి బూర్జువా పాలకవర్గం మెతక వైఖరి రాజీలు సంస్కరణ వైఖరి కొనసాగించిన ఫలితంగా కొన్ని గ్రామీణ ప్రాంతాలలో భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతున్న ఫలితంగా నక్సల్ బరి శ్రీకాకుళం తెలంగాణ లాంటి అనేక ప్రాంతాలలో భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలు తీవ్రమైనవి. ఈ పోరాటాల ఫలితమే పాలకవర్గాలు అనివార్యంగా కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న పెట్టుబడి దారీ విధానం , భారతదేశంలో క్రమక్రమంగా అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం , భూస్వామ్య వ్యతిరేక సాయుధ పోరాట ఉద్యమాలు భూస్వామ్య వ్యవస్థను తీవ్రంగా నాశనం చేసింది. భూస్వాములు పెట్టుబడిదారీ వర్గాలుగా మారిపోయినారు .
భారత బూర్జువా వర్గాల రాజ్యాధికారంలో పెట్టుబడిదారీ విధానం 1947 నుండి క్రమక్రమంగా పెరుగుతూ అన్ని ప్రాంతాల్లో అన్ని రంగాల్లో సంఘటిత పడుతూ వస్తున్నది.
ఈ పెట్టుబడిదారీ విధానం కారణంగానే 60 కోట్ల సంఘటిత అసంఘటిత కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీకి గురి అవుతూ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పేద మధ్యతరగతి రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. చిన్న ఉత్పత్తిదారులు చిన్న వ్యాపారులు గుత్త పెట్టుబడిదారీ సంస్థల మూలంగా, ప్రభుత్వ విధానాల మూలంగా తీవ్రంగా నష్టపోతున్నారు. గుత్త పెట్టుబడి దారి (కార్పొరేట్) విధానాల ఫలితంగా దేశంలోని కార్మికులు రైతులు ఉద్యోగస్తులు చిన్న మధ్య వ్యాపారస్తులు ఆదివాసులు దళితులు మహిళలు విద్యార్థులు వగైరా అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి అణిచివేతకు వివక్షతకు గురి అవుతున్నారు.
ఏ దిక్కు చూసినా పెట్టుబడిదారీ విధానం భయానకంగా ఉన్నది. ప్రజలను ఆర్థికంగా రాజకీయంగా సాంస్కృతికంగా పర్యావరణ పరంగా శారీరకంగా మానసికంగా కుటుంబ పరంగా దోపిడీ చేస్తున్నది అణచివేస్తున్నది ఒత్తిడికి గురి చేస్తున్నది తీవ్రమైన నష్టాలకు గురిచేసేది పెట్టుబడిదారీ వర్గాలు, పెట్టుబడిదారీ విధానమే.
ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడిగా ప్రజలు సంఘర్షిస్తూనే తమ తమ అస్తిత్వ సమస్యలపై విడిగా ప్రభుత్వం వ్యతిరేకంగా పోరాటం అవసరమైనది. చట్టబద్ధంగా తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడానికి సంఘటితంగా కృషి చేయాలి.
నేడు వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ఎత్తిపట్టడం అంటే శ్రామిక వర్గానికి చెందిన అన్ని కులాల అన్ని మతాల పీడిత ప్రజలను ఐక్యము చేస్తూ పెట్టుబడి దారి దోపిడీకి అణిచివేతకు వివక్షతకు వ్యతిరేకంగా పోరాడవలసి ఉంటుంది.
నేడు పోరాటం అంటే దేశంలోని అన్ని ప్రాంతాలలో అన్ని వర్గాలు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సంఘటిత పడి శ్రామిక రాజకీయ అధికారాన్ని నెలకొల్పే దిశగా కొనసాగడానికి నిర్ణయించుకోవడమే నేటి తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవ స్ఫూర్తి.

**జంపన్న (డెమొక్రటిక్ సోషలిస్ట్)**



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్,టీచర్స్ మీటింగ్

- **ముఖ్య అతిథిగా హాజరు అయినా వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్**



**జర్నలిస్ట్ డైరీ కోడంగల్ (సెప్టెంబర్ 16):** వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ రోజు కళాశాల ప్రిన్సిపాల్ టీ వసంత అధ్యక్షతన పేరెంట్స్,టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ హనుమంతు రిటైర్డ్ హెడ్మాస్టర్ వీరన్న ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నోడల్ అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులే ఉన్నత విజయాలను సాధించారని, ప్రభుత్వ కళాశాలలో చదివే మీరు కూడా ఉన్నత విజయాలను సాధించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.చదువుకునే తమ పిల్లలపట్ల తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఉండాలని,ప్రతిరోజూ తమ పిల్లలను ఇంటిదగ్గర చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు మాట్లాడుతు విద్యార్థుల తల్లిదండ్రులు కనీసం నెలకి ఒక్కసారైనా కాలేజికి వచ్చి అధ్యాపకులను,ప్రిన్సిపాల్ ను కలిసి తమ పిల్లల చదువు గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల జీవిత అభివృద్ధిలో తల్లిదండ్రులే ప్రధాన పాత్ర వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ హెడ్మాస్టర్ వీరన్న మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిపి ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినరు అని కళాశాల యాజమాన్యాన్ని కొనియాడారు.కళాశాల అభివృద్ధి తన వంతుగా సహాయసహకారాలు అందిస్తానన్నారు. సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీపరీక్షలకు సంబంధించిన బుక్స్ మన లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయని,విద్యార్థులు లైబ్రరీకి వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దౌల్తాబాద్ లైబ్రేరియన్ శివ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ టి.వసంత విద్య యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ,విద్యార్థులకు మార్గ నిర్దేశనం చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయాన్ని నేర్పించడంలో మా కాలేజ్ యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ కాలేజ్ కి పంపించాలని,పిల్లల చదువుపై నిఘా పెట్టాలని, వీలైనంత వరకు పిల్లలను ఫోన్ కి దూరంగా ఉంచాలని తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యాపకులు ముఖ్య అతిథులను సన్మానించడం జరిగింది.అనంతరం కళాశాల అధ్యాపకులు,విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకల దొంగల ముఠా అరెస్ట్

- **షాద్ నగర్ లో ఏడుగురు ముఠా సభ్యుల రిమాండ్***
- **రూ.2.62 లక్షల నగదు, నాలుగు వాహనాలు, 7 మొబైల్ లు, 4 కార్లు స్వాధీనం..**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :** కార్లు వేసుకొని సాయంత్రం వేళ సరదాగా బయటికి వెళ్లాలి.. మేకలు, గొర్రెల గుంపులు ఎక్కడెక్కడ ఉన్నాయో వెతకాలి.. అర్ధరాత్రి అటాచ్ చేసి సైలెంట్ గా దోచేయాలి.. జియాగూడ మార్కెట్ కు తీసుకువెళ్లి అమ్మేయాలి.. చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డ యువత ఒక ముఠాగా మారి చేస్తున్న ఈ ఆగడాలకు షాద్ నగర్ పోలీసులు తెరదించారు. రెండు జిల్లాలలో వివిధ చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ ఈ ముఠా కు సంబంధించిన వివరాలను ఏసీపీ లక్ష్మీ నారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్ మీడియా సమావేశంలో తెలియజేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం తో పాటు, కర్ణాటక , హైదరాబాదులోని పహాడీ షరీఫ్ ప్రాంతానిలకు చెందిన మహమ్మద్ ఫిరోజ్ (24), అబ్దుల్ కలీం (25), మొహమ్మద్ సోహెల్ (24), షేక్ రవూఫ్ (23), మహమ్మద్ జమీర్ (26), మహమ్మద్ ఆరిఫ్ (25), షేక్ హసీనుద్దీన్ (22), కోయల్ కార్ సాయికిరణ్ (30)లు ఈ దోపిడీ ముఠాలోని సభ్యులు. చిన్నతనం నుంచి చెడు స్నేహాలకు అలవాటు పడి మత్తుపదార్థాలకు బానిసలైన ఈ యువకులు డబ్బు కోసం ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఇందుకోసం నాలుగు వాహనాలను తమకు అందుబాటులో పెట్టుకున్నారు. ఆయా వాహనాలలో రోజు తిరిగి మేకలు ఎక్కడెక్కడ ఉన్నాయో వెతికి రాత్రి కాగానే ఒక డీసీఎం తీసుకుని వెళ్లి మేకలను అందులో ఎక్కించి జియాగూడ మార్కెట్లో అమ్మి వేయడం వీళ్లు దినచర్యగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే షాద్ నగర్ పరిధిలో చించోడులో 28, వెలిజర్లలో 8, చౌదరిగుడాలో 8, ఎల్కిచర్లలో 23, కొందుర్గు మండలం తంగెడపల్లిలో 8, వెంకిర్యాలలో 9, పరిగి మండలంలో కోటివాడలో 12, సుల్తాన్ పూర్ లో 30, దోమ మండలం వుదంతా రావు పల్లి లో 15, జధిరసం పల్లిలో ఆరు మేకలు, గొర్రెలను దొంగిలించారు. ఇదే రీతిన ఈనెల 14వ తేదీన పురపాలక పరిధిలోని సోలిపూర్ వద్ద దొంగతనానికి పాల్పడుతుండగా షాద్ నగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. శంషాబాద్ డిసిపి రాజేష్ పర్యవేక్షణలో సాగిన ఈ విచారణ సిపిఎస్ డిసిపి ముత్యంరెడ్డి, అడిషనల్ డీసీపీ పూర్ణచంద్రరావు, శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, శ్రీలక్ష్మిల నేతృత్వంలో విచారణ కొనసాగింది. షాద్నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ సిఐ వెంకటేశ్వర్లు లో ఆధ్వర్యంలో ఎస్సై లు పవన్ కుమార్, అవినాష్ బాబు, శ్రీనివాస్, భూపాల్, శివారెడ్డి, సిబ్బంది కుమార్, మహేందర్, జాకీర్, నవీన్, రమేష్, రవి, భీమయ్య, రవీందర్, కరుణాకర్, మోహన్ లాల్, జాకీర్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



# సింగరేణి స్టోర్స్ ను తనిఖీ చేసిన సెక్యూరిటీ జీఎం

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలని. (సెప్టెంబర్ 16):** సింగరేణి సెక్యూరిటీ జనరల్ మేనేజర్ చందా లక్ష్మీ నారాయణ, మంగళవారం రామగుండం రెండవ ఏరియా ఓసీపీ.3 ప్రాజెక్టు లో సందర్శించారు. సాయంత్రం ఇక్కడికి వచ్చిన ఆయన ప్రాజెక్టు అనుసంధానంగా ఉన్న స్టోర్స్, ఏరియా స్టోర్స్ లలో సందర్శించి, స్టోర్స్ లలో నిలువ ఉన్న యంత్రాల అతి విలువైన పరికరాలను తనిఖీ చేసి, స్టోర్స్ లో నిలువ ఉన్న పరికరాలను, పంపిణీ చేసిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టోర్స్ లో చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల పట్ల సంబంధిత స్టోర్స్, సెక్యూరిటీ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇక సెక్యూరిటీ జీఎం వెంట స్టోర్స్ డిజియం
విజయ్ కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మమ్మద్, జూనియర్ ఇన్స్పెక్టర్ పిపి.రాజయ్య, షిఫ్ట్ డిజైర్ తోట రాజేశం పాల్గొన్నారు.



# మీర్‌పేట్‌లో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**జర్నలిస్ట్ డైరీ, మీర్‌పేట్(సెప్టెంబర్ 16):** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ కమాన్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్షిత్ రెడ్డి (21) మృతిచెందాడు. అక్షిత్ తన స్నేహితుడు రాజా రామ్ (21)తో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ (TS 07S0229)పై ప్రయాణిస్తూ ఉండగా బాలాజీ మిఠాయ్ షాపు ఎదురుగా డివైడర్‌ను ఢీకొట్టాడు. బైక్ అదుపు తప్పడంతో అక్షిత్ రెడ్డి రోడ్డుపై పడిపోగా, రాజా రామ్ ఎదురుగా వస్తున్న స్కూటీపై పడి గాయపడ్డాడు. వెంటనే ఇద్దరినీ డీఆర్డీవో ఆసుపత్రికి తరలించగా, అక్షిత్ రెడ్డిని మరణించినట్లుగా డాక్టర్లు ధ్రువీకరించారు. రాజారామ్ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్ మార్టం అనంతరం అక్షిత్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

- **భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలి**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :** నాడు జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తిని కొనసాగిద్దాం భవిష్యత్తు ఉద్యమాలకు బాటలు వేద్దాం అని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. షాద్ నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్ లో జరిగిన తెలంగాణ వార్షికోత్సవ నియోజకవర్గ సభ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య
మాట్లాడారు. నాడు తెలంగాణ సమాజం విముక్తి కావాలని లక్షల ఎకరాల భూములు పేదలకు దక్కాలని గ్రామాలను విముక్తి చేయాలని పోరాడిన విప్లవ యోధులు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపిన వీరులు ఎందరో ప్రాణాలు అర్పించి నడిపిన సాయిధ పోరాటాన్ని నేడు బిజెపి నాయకులు వక్రీకరించి నిజాము రాజు ముస్లిం కాబట్టి పోరాడింది హిందువులని చరిత్రను వక్రీకరించే పద్ధతిలో మాట్లాడడం సరైనది కాదని సాయుధ పోరాటంతో మీకు ఏమిటి సంబంధం అని ఆయన బిజెపి నాయకులను ప్రశ్నించారు
గ్రామ గ్రామాన తెలంగాణ సాయుధ పోరాటం యొక్క స్ఫూర్తిని కొనసాగించే పద్ధతిలో మన పోరాటాలు ఉండాలని షాద్నగర్ నియోజకవర్గ కమిటీ నిర్మాణం పైన అభివృద్ధి పైన దృష్టి పెట్టి పనిచేస్తే బలపడే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు

ఈ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని దానికి జిల్లా పార్టీ సహాయ సహకారాలు ఉంటాయని ఆయన తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నియోజకవర్గంలో వందలాది పరిశ్రమలు ఉన్నాయని లక్షలాదిమంది కార్మికుల పని చేస్తున్న వారికి ఎలాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు పూర్తిగా విఫలం అవుతున్నాయని భవిష్యత్తులో కార్మికోరుగా పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు సిపిఐ పార్టీ నియోజకవర్గ కమిటీ తరఫున ప్రజా సమస్యల మీద భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు నిర్వహిద్దామని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్ధుల జంగయ్య మండల కార్యదర్శులు md షకీల్ గోవింద్ నాయక్ నర్సింహ గడ్డం జంగయ్య వెంకటేష్ లింగం నాయక్ చంద్రబాబు ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్ సీపీఐ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెత్తాచెదారం ఇంకెన్నాళ్లు?

- **కేసులు పెడతామన్నా భయం లేదా?**

**జర్నలిస్ట్ డైరీ, ఎల్బీ నగర్(సెప్టెంబర్ 16):** రోడ్లమీద ఇష్టారాజ్యంగా చెత్తను పారవేస్తే.. కఠినంగా వ్యవహరిస్తామని ఇప్పటికే నగర పోలీసులు ప్రకటించారు. అపరిశుభ్రతకు కారణమవుతున్న షాపులు, హోటళ్లు, ఇతర సంస్థల యాజమాన్యాలపై చర్యలు ఉంటాయని చెబుతూనే, నిత్యం చెత్తను రోడ్లపై పారవేసే వారిపై నిఘా పెట్టాలని, సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించి వారిపై కేసులు నమోదు చేయాలని కూడా ఆదేశించారు. ఇంతగా పోలీసులు చెబుతున్నా.. వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. ఇక్కడ కనిపిస్తున్న దృశ్యమే దీనికి నిదర్శనం. ఇది ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని పంచాయతీ ఆఫీసు పక్కన ఉన్న రోడ్డు ఇది. ఇదంతా కిరాణా షాపులు, పూజాసామాగ్రి దుకాణాలు పెద్దఎత్తున ఉండే చోటు. అయితే ఇక్కడి దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను, చెత్తను అలాగే వదిలేసి వెళ్లిపోవడంతో రోడ్డంతా



ఇలా నిండిపోతుంది. కనీసం వాటిని ఓ సంచిలో వేయాలన్న కనీస అవగాహన కూడా ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం జీహెచ్ఎంసీ వాళ్లు ఊడ్చేస్తారులే అనే భావనతో ఎలా పడితే అలా వదిలేసి వెళుతున్నారని, అవన్నీ గాలికి ఎగిరి రోడ్డంతా చెత్తాచెదారంతో నిండిపోతుందని స్థానికులు మండిపడుతున్నారు. అయితే బాధ్యతగా వ్యవహరించాల్సిన మార్కెట్ అసోషియేషన్ కూడా దీన్ని చూసీచూడనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. ఎవరికి వాళ్లు క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచిస్తున్నారు.



# కృష్ణా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

**జర్నలిస్ట్ డైరీ, జమ్మికుంట ( సెప్టెంబర్ 16 ):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణా కాలనీ ( 27వ వార్డ్ ) లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారించాలని కోరుతూ జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ కు సామాజిక కార్యకర్త, కృష్ణా కాలనీలో నివాసి గాజంగి వీరన్న వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ కృష్ణా కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని, కాలనీ వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కనకయ్య మేస్త్రి ఇంటి ముందర ఉండే డ్రైనేజీ మీదగల కల్వర్టు డ్యామేజ్ అయిందని దీంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరుతుండటంతో కాలనీ వాసులకు సమస్యగా మారిందన్నారు. వర్షాలు పడుతుండటంతో విషజ్వరాలు ప్రబలే పరిస్థితి లేకపోలేదని తెలిపారు. కాలనీలో వాహనదారులు కిందపడిపోయి, గాయపాలైన సందర్భాలు ఉన్నాయన్నారు. రోడ్డుకు ఓకే వేపు డ్రైనేజీ ఉండటంతోనే సమస్య తలెత్తుతుందని, కనకయ్య మేస్త్రి ఇంటి నుండి రెండు వైపులా కాలనీ లో కొత్త డ్రైనేజీలను నిర్మించాలని, కాలనీలో పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. 2021 సంవత్సరంలో పదవ నెలలో మిషన్ భగీరథ నీళ్ళను ఇవ్వడం జరిగిందని, నల్ల బిల్లు మాత్రం 2019 సంవత్సరం నుండి కట్టాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందనాల జయ రాములు, కురిమిండ్ల కనకయ్య మేస్త్రి, మూల హరీష్, కురిమిండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జెవైఎం కాలనీ మండల కమిటి నియామకం



**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ. (సెప్టెంబర్ 16):** కాలనీ మండల బిజెపి అనుబంధ భారతీయ జనతా యువ మోర్చ (బిజెవైఎం) అధ్యక్షులుగా ఐలవేన అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల అఖిల్ గౌడ్ లు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బిజెపి కాలనీ మండల అధ్యక్షులు ఆకుల శశికుమార్ వారిరువురికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శశి కుమార్ మాట్లాడుతూ.. అనిల్ కుమార్, గతంలో ఏబీవీపీ కేశవ నగర్ మండలం కన్వీనర్ గా, బిజెవైఎం జిల్లా కార్యదర్శి గా, బాధ్యతలు నిర్వహించారన్నారు. ఇక నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు మాట్లాడుతూ.. తమ నియామకాలను ఖరారు చేసిన బిజెపి కాలనీ మండల అధ్యక్షులు శశి కుమార్ కు, ఈ అవకాశం కల్పించిన బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ్ రెడ్డి, రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ కందుల సంధ్యా రాణి, జిల్లా నాయకులు మూకిరి రాజు, ఇతర సీనియర్ నాయకులకు, కృతజ్ఞతలు తెలిపారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :** షాద్ నగర్ మున్సిపాలిటీ లో 8వ వార్డు అయ్యప్ప కాలని,ఆర్టీసీ కాలనీ లో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల ద్వారా మంజూరైన 80.0 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ గారు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.షాద్ నగర్ మున్సిపల్ అభివృద్ధికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని,భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,షాద్ నగర్ గ్రంధాలయం కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, నేతలు అగ్గనూర్ బస్వం,చెంది తిరుపతి రెడ్డి ,మహ్మద్ ఇబ్రహీం,వర్ష గౌడ్,జయ ప్రకాష్, అందే మోహన్,అందే శ్రీకాంత్ , కొప్పునూరి ప్రవీణ్, మురళీమోహన్,మాధవలు యాదవ్,అర్జున్ లక్ష్మణ్,దిలీప్, చంద్రశేఖర్,రవితేజ ,శ్రీశైలం గౌడ్,మసూద్ ఖాన్ శ్రీనివాస్,కాలనీ వాసులు సాయి కృష్ణ,దాసా కృష్ణయ్య,అనిల్ కుమార్, అరుణ్,శేఖర్,రాజు,కోట లింగం, రఘు, సాయిరామ్, సాయి పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం ప్రభుత్వం మరిచిపోయింది



**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 16) :** జర్నలిస్టుల సమస్యలను తీర్చడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ పేర్కొన్నారు. సమాచారం శాఖామంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. చిన్న పత్రికలు ఏంప్యానల్ మెంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం నుంచి వేచి చూస్తున్నాయని మరి వాటిని ఎందుకు ఎంప్యానెల్ చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ పాలన విధానాలనే రేవంత్ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని అందులో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో అక్రిడేషన్ కార్డుల జారీలో భారీగా అవకతవకలు జరిగాయని వాటిని సరి చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెండు సంవత్సరాలు కూడా సరిపోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసి తిరిగి వాళ్లపైన తప్పుడు కేసులు పెడుతుంటే పోలీసులు దాడి చేసిన వాళ్లకే సహాయం అందిస్తూ రిపోర్టర్లను శత్రువులుగా చూస్తున్నారన్నారు. జీతభత్యాలు దేవుడెరుగు అది వచ్చింది లేదు పోయేది లేదు దానికోసం కాలక్షేపం తప్ప జర్నలిస్టులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడంలో కేసీఆర్ సర్కారును మరిపిస్తున్నారని అదే కాకుండా ప్రభుత్వ అధికారుల అవినీతిని వెలికితీస్తున్న జర్నలిస్టులను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. అధికారుల అవినీతిని, నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని బయటకి తీయడం వల్లనే ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ విధానాలు ప్రజలలోకి వెళతాయని ఈ చిన్నపాటి విషయాన్ని కూడా ఎమ్మెల్యేల నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు మరిచిపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పదేపదే అనడం తప్ప వాళ్ల కోసం చేసింది శూన్యమన్నారు. మాటలు ఎన్నైనా చెప్పవచ్చని వాటిని అమలుపరచడం చేసినప్పుడే చెప్పిన మాటలకు సార్ధకత ఉంటుందన్నారు. జీవో ల ప్రకారం ఉన్న జర్నలిస్టులకు అక్రిడేషన్లు కార్డులు ఇస్తే అదే అవార్డులు ఇచ్చినంత గొప్ప అని ఇక అవార్డులు ఇచ్చిన జర్నలిస్టులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిపాలైన జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తిస్థాయిలో బిల్లు చెల్లిస్తే అదే వాళ్లకు పెద్ద అవార్డు అని వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని తెలిపారు. అనారోగ్యాల పాలవుతున్న జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తి మొత్తం చెల్లించి సంక్షేమం కోసం పాటు పడతామని చెబితే బాగుంటుందని ఈ సందర్భంగా సమాచారం శాఖ మంత్రికి ముఖ్యమంత్రికి గౌటి రామకృష్ణ సూచించారు. ఇప్పటికైన రేవంత్ సర్కార్ స్పందించి జర్నలిస్టులపై మాటిమాటికి ప్రకటన చేయడం కాకుండా వాటిని అమలు చేయడం చేస్తే బాగుంటుందని కోరారు.

# అమరవీరులకు కమ్యూనిస్టు నేత సీతారామయ్య నివాళి

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలని. (సెప్టెంబర్ 16):** సింగరేణి రామగుండం 11 వ గనిపై, మంగళవారం ఏఐటీయూసీ అధ్యక్షులు వి.సీతారామయ్య తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులకు నివాళి అర్పించారు. ఉదయం గనికి వచ్చిన ఆయన గని వద్ద స్తానిక గని కార్మికులు ఏర్పాటు చేసిన స్మారక స్థూపానికి పూలమాలవేసి, తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన అమర వీరులకు నివాళులు అర్పించారు.



# రెవెన్యూ, ఆదాయార్జన శాఖలపై సీఎం సమీక్ష.. కలెక్టర్లకు దిశానిర్దేశం

- **రెవెన్యూ, ఆదాయార్జన శాఖలపై సీఎం సమీక్ష..**
- **జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



రెవెన్యూ, ఆదాయార్జన శాఖలపై సమీక్షించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు.. కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.. తిరుపతి ఎర్రచందనం డిపో సీసీటీవీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు.. ఎర్రచందనం దుంగలను వ్యాల్యూ అడిషన్ చేసి ఉత్పత్తులు తయారు చేయాలి.. అలాగే ఎర్రచందనం ఉత్పత్తులు, ఇతర అంశాలు తెలియచేసేలా డిపో వద్ద ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.. ప్రపంచ వ్యాప్తంగా ఎర్రచందనం అనేది ఓ అరుదైన జాతి వృక్షంగా పేర్కొన్నారు.. ఇక, మోటారు వాహనాల పన్నులపై కలెక్టర్లు దృష్టి సారించాలి.. మున్సిపల్ విభాగం శాటిలైట్ చిత్రాల ఆధారంగా అక్రమ కట్టడాలను గుర్తించేలా ప్రక్రియ చేపట్టాలి.. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీమ్ ను పూర్తి చేసేలా కలెక్టర్లు ఫోకస్ చేయాలి.. కొత్త లేఔట్లలో డ్రైన్లకు స్థలం కేటాయించేలా అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు.. ఇక, స్వర్ణ పంచాయత్ పోర్టల్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.. గ్రామకంఠంలోని ఆస్తులకు కోటికి పైగా యాజమాన్య పత్రాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు సీఎం చంద్రబాబు.. 60 శాతం ఫిర్యాదులు రెవెన్యూ శాఖ లోనే వస్తున్నాయన్న ఆయన.. కులధృవీకరణ, భూములు ఇలా వేర్వేరు అంశాలు ఉన్నాయి.. 22 ఏలో భూములు పెట్టేయటం లాంటి చర్యల వల్ల దుష్పలితాలు వచ్చాయన్నారు.. గత ప్రభుత్వ హయాంలో, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను తీసుకువచ్చి ఇష్టానుసారం వ్యవహరించారు.. ఇప్పుడా చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తుల రక్షణకు వీలుగా చట్టాన్ని తెచ్చాం.. భూముల్ని కాజేయడానికి 22ఏలో పెట్టి బ్లాక్ మెయిల్ చేశారు. రీసర్వే చేసి ఈ రికార్డులను సరిచేయాలి. నిర్దేశిత గడువులోగా వీటిని ప్రక్షాళన చేయాని కలెక్టర్లను ఆదేశించారు సీఎం చంద్రబాబు.. కులం ఎవరిదీ మారిపోదు దానిని శాశ్వతప్రాతిపదికన ఇవ్వాలి.. నివాస, వయో ధృవీకరణ కోసం ప్రతీ ఏటా జారీ చేయొచ్చు.. అభ్యంతరం లేని భూములన్నీ రెగ్యులర్ చేస్తే సమస్య శాశ్వతంగా పరిష్కృతం అవుతుందన్నారు సీఎం చంద్రబాబు.. 2027 కంటే ముందే రీసర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రయత్నించండి అని సలహా ఇచ్చిన ఆయన.. రికార్డులన్నీ ప్రక్షాళన చేయటమే లక్ష్యంగా పని చేయాలి.. జియో ట్యాగింగ్, క్యూఆర్ కోడ్ కూడా పెట్టి రికార్డులు ఇస్తాం.. వీఎంలు, కేఎంలు మార్చాం కానీ రెవెన్యూ విలేజిలను మార్చలేకపోతున్నాం అన్నారు.. ఇక, అక్టోబరు 22 వరకూ నెల రోజుల పాటు జీఎస్టీ ప్రయోజనాలు వివరించేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు సీఎం చంద్రబాబు నాయుడు..



## అమరావతి ఐకానిక్ వంతెన నమూనా ఎంపిక..

- **హైదరాబాద్-అమరావతి మధ్య తగ్గనున్న 35 కిలోమీటర్ల దూరం..**
- **అమరావతిని అనుసంధానం చేస్తూ ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మాణం..**
- **ఐకానిక్ వంతెన డిజైన్‌ను ఖరారు చేసిన సీఎం చంద్రబాబు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో ఐకానిక్ వంతెన నమూనా ఫైనల్ అయింది. ఈ వంతెన నిర్మాణం పూర్తైతే హైదరాబాద్ - అమరావతి మధ్య దూరం సుమారు 35 కిలో మీటర్ల తగ్గనుంది. ఇక, అమరావతిని అనుసంధానించే దిశగా ఏపీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారు చేశారు. ఇటీవల నాలుగు నమూనాలను సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో ఉంచి ప్రజల అభిప్రాయ తీసుకున్నారు. అందులో రెండో ఆప్షన్‌కు దాదాపుగా 14 వేల ఓట్లు రావడంతో అదే నమూనా ఎంపికైంది. అయితే, ఇప్పటికే ఈ నమూనాకు సంబంధించిన డీపీఆర్ సిద్ధమైంది. అమరావతిలోని ఎన్-19 రోడ్డును ఎన్‌హెచ్-65 (విజయవాడ-హైదరాబాద్ రహదారి)తో అనుసంధానం చేసేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. రూ.2,500 కోట్ల వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్లను ఏపీ ప్రభుత్వం పిలవనుంది. కాగా, ఎరుపు, తెలుపు రంగుల్లో జంట పైలాన్లతో రూపుదిద్దుకునే ఈ ఐకాన్ వంతెన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఎన్టీఆర్ జిల్లా మూలపాడు వరకు 5.22 కిలో మీటర్ల పొడవున కేబుల్ బ్రిడ్జ్‌ను నిర్మించనున్నారు.

ఇక, ప్రస్తుతం ఎన్‌హెచ్-65 నుంచి అమరావతికి చేరుకోవాలంటే మూలపాడు, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, కనకదుర్గ వంతెన, ప్రకాశం బ్యారేజ్ మీదుగా 40 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. ఈ ఐకానిక్ వంతెన పూర్తైతే మూలపాడు నుంచి కేవలం 5 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తే అమరావతి లోకి నేరుగా ప్రవేశం లభిస్తుంది. ఈ వంతెన నిర్మాణంతో సుమారు 35 కిలో మీటర్ల దూరం తగ్గి, గంటన్నర సమయం ఆదా కానుందని అధికారులు తెలిపారు.




## 'విజయవాడ ఉత్సవ్'కు హైకోర్టు షాక్..!

- **విజయవాడ ఉత్సవ్ నిర్వహకులకు హైకోర్టు షాక్..!..**
- **దేవాదాయ భూముల్లో విజయవాడ ఉత్సవ్ నిర్వహించడంపై పిటిషన్..**
- **దేవాదాయ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దు..**
- **వ్యవసాయేతర అవసరాలకు ఎలా ఉపయోగిస్తారని ప్రశ్న..**
- **గ్రావెల్, మట్టి, కంకరలను వెంటనే తొలగించాలని ఆదేశాలు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 11 రోజుల పాటు విజయవాడ ఉత్సవ్ పేరుతో కృష్ణానది తీరంలో భారీ ఈవెంట్స్, ఎగ్జిబిషన్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండగా.. నిర్వహకులకు షాక్ ఇచ్చింది ఏపీ హైకోర్టు.. విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో గొడుగుపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానికి సంబంధించిన దేవాదాయ భూముల్లో విజయవాడ ఉత్సవ్ నిర్వహించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. దేవాదాయ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని ఆదేశాలు జారీ చేసింది.. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించింది.. అందులో తోలిన గ్రావెల్, మట్టి, కంకరలను వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇచ్చింది.. అంతేకాదు, ఆ భూములను యథాస్థితికి తీసుకు రావాలని ఆదేశించింది..

అయితే, ఈ భూములను ఇప్పటికే 56 రోజుల పాటు లీజుకు ఇచ్చింది దేవాదాయశాఖ.. ఇక, లీజు మొత్తాన్ని కూడా గొడుగుపేట దేవస్థానానికి ఎగ్జిబిషన్ నిర్వాహకులు చెల్లించారు.. కానీ, దీనిపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ హైకోర్టు.. తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా వేసింది.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది ఏపీ హైకోర్టు.. కాగా, సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారథ్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు 'విజయవాడ ఉత్సవ్' పేరుతో కృష్ణా నది తీరంతో పాటుగా నగరంలోని మైదానాల్లో సంగీత, సినీ, సాంస్కృతిక వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.. మరోవైపు, కృష్ణానదిలో పడవల పోటీలు, డ్రోన్ షో, ఎగ్జిబిషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.. దేవీ నవరాత్రుల సందర్భంగా బెజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలు భక్తులు తరలిరానుంగా.. వారిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ ఉత్సవ్‌కు ఏర్పాట్లు చేస్తుండగా.. ఇప్పుడు హైకోర్టు వారికి షాక్ ఇచ్చినట్టు అయ్యింది

## టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు..

- **23న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ..**
- **24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు..**
- **10 రోజుల పాటు సిఫార్సు లేఖల స్వీకరణ రద్దు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది.. 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.. 23వ తేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుండగా.. ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని.. 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు..

ఇక, ఇస్రో సహకారంతో క్రౌడ్ మేనేజ్మెంట్ మానిటరింగ్ చేస్తాం.. బ్రహ్మోత్సవాల సమయంలో 10 రోజుల పాటు సిఫార్సు లేఖల స్వీకరణ రద్దు చేశాం.. భక్తుల సౌకర్యార్థం అదనంగా 8 లక్షల లడ్డూలు తయారు చేస్తున్నామని తెలిపారు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.. కర్నాటక రాష్ట్రం బెల్గాంలో ఏడు ఏకరాల స్థలంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఆమోదం లభించింది.. గుంటూరు జిల్లా తుల్లురు మండలం అనంతవరం గ్రామంలో ఆలయ అభివృద్ధి పనులకు 7.2 కోట్ల రూపాయలు కేటాయించింది టీటీడీ.. గుంటూరు జిల్లా ఖాజా గ్రామంలో దాతలు ఇచ్చిన 89 లక్షల విలువైన స్థలం స్వీకరణకు ఆమోదం తెలిపింది పాలకమండలి.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దళితవాడలో వెయ్యి ఆలయాల నిర్మాణం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు..

మరోవైపు, టీటీడీపై అసత్య ప్రచారం చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.. ఇక, శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షలు నిరంతరాయంగా జరుగుతున్నాయన్నారు టీటీడీ ఈవో సింఘాల్.. 19వ తేదీన జిల్లా యంత్రాంగంతో కలసి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం అన్నారు అనిల్ కుమార్ సింఘాల్.. అయితే, టీటీడీ ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్ కుమార్ సింఘాల్ కు టీటీడీ పాలక మండలి చైర్మన్ బీ.ఆర్.నాయుడు, పాలకమండలి సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈవోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి బోర్డు సమావేశానికి హాజరైన సింఘాల్‌ను చైర్మన్, సభ్యులు స్వాగతించి, అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఈవోగా పనిచేసిన అనిల్ కుమార్ సింఘాల్ కు ఉన్న అనుభవం భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో, టీటీడీని అభివృద్ధి దిశగా నడిపించడంలో ఉపయోగపడుతుందని పాలకమండలి సభ్యులు ఆకాంక్షించారు.





## దసరా అంటే దేశమంతా విజయవాడ వైపు చూసేలా నిర్వహిస్తాం..

- **విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం..**
- **11 రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం..**
- **దసరా అంటే దేశమంతా విజయవాడ వైపు చూసేలా చేస్తాం: మంత్రి సత్యకుమార్**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా మంత్రి సత్యకుమార్ యాదవ్ తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి నాయకులు హాజరయ్యారు. విజయవాడ ఉత్సవ్ దిగ్విజయం చేయడంపై ప్రజాప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. 11 రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందాం.. అంతరించిపోతున్న కళలను పరిరక్షించుకుంటూ వేడుకలు నిర్వహిద్దాం అని పిలుపునిచ్చారు. ఇక, ప్రజలను ఇందులో మమేకం చేద్దామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దసరా అంటే ప్రజలకు విజయవాడ వెళ్లాలనిపించేలా ఈ వేడుకలు నిర్వహిస్తున్నాం.. విజయవాడను పర్యాటకంగా తీర్చిదిద్దడానికి ఈ వేడుకలు దోహదపడతాయి అన్నారు. ఈ ఏడాది మొదలు పెట్టిన చిన్న ప్రయత్నం ప్రపంచానికి చాటి చెప్పేలా చేస్తామన్నారు. ఈ జిల్లాకు ఇన్చార్జి మంత్రిగా ఉన్న సమయంలో నాకు భాగస్వామ్యం కల్పించటం సంతోషంగా ఉందన్నారు. దసరా అంటే దేశం అంతా విజయవాడ వైపు చూసేలా నిర్వహిస్తాం.. మైసూర్ తరహాలో విజయవాడలో దసరా ఫెస్టివల్ నిర్వహిస్తామని సత్యకుమార్ చెప్పుకొచ్చారు.

## ఏపీలో ఆరోగ్య శ్రీ సేవలకు సుస్తీ..

- **ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ కీలక నిర్ణయం..**
- **ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ఆస్పత్రులు..**
- **నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు రూ.2,500 కోట్ల బకాయిలు..**
- **సమస్యను వారంలో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరిన హాస్పిటల్స్ అసోసియేషన్..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని స్పెషాలిటీ హాస్పిటల్స్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. నిన్నటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు 2,500 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. వారంలోగా సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక, ఎన్టీఆర్ వైద్య సేవ సీఈఓ దినేష్ కుమార్ కి ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ప్రతినిధులు లేఖ రాశారు. ఇక, ఇప్పటికి మూడు సార్లు సమ్మె బాట పట్టిన నెట్‌వర్క్ హాస్పిటల్స్.. 200 కోట్ల రూపాయల బకాయిలు ఉండడంతో ఎంప్లాయిస్ హెల్త్ స్కీం గత కొంతకాలంగా ఆయా ఆస్పత్రులు ఆపేశాయి. అలాగే, ఈ బకాయిలపై ఏపీ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అభ్యర్థన చేశారు.

మరోవైపు, తెలంగాణలోని దవాఖానల్లో నేటి నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (TANHA) సెప్టెంబర్ 16 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించపోవడంతో రూ.1400 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని చెప్పుకొచ్చారు. త్వరగా మొండి బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## వివేకా కేసు విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

- **సుప్రీంకోర్టులో వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై విచారణ..**
- **కేసులో మరింత విచారణ జరపాలి, కొందరి బెయిల్‌లను రద్దు చేయాలని..**
- **వైఎస్ వివేకా కూతురు సునీత పిటిషన్..**
- **ఇప్పటికే సీబీఐ ఫైనల్ ఛార్జిషీట్ ఫైల్ చేసింది..**
- **నిందితుల బెయిల్ రద్దు విషయంలో ఇప్పుడు జోక్యం చేసుకోలేం..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది సుప్రీంకోర్టు.. ఈ కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించారు వైఎస్ వివేకా కూతురు డాక్టర్ సునీతా రెడ్డి.. కేసులో మరింత విచారణ జరపాలి, కేసుతో సంబంధం ఉన్న కొందరి బెయిల్‌లను కూడా రద్దు చేయాలని వైఎస్ వివేకా కూతురు తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు.. అయితే, ఇప్పటికే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఫైనల్ ఛార్జిషీట్ ఫైల్ చేసింది... నిందితుల బెయిల్ రద్దు విషయంలో ఇప్పుడు జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు.. అయితే, తదుపరి దర్యాప్తు కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని పిటిషనర్‌కు సూచించింది సుప్రీంకోర్టు. ఇక, వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముగిసిందని కోర్టుకు తెలిపారు అడిషనల్ సొలిసిటర్ జనరల్ రాజు.. తదుపరి దర్యాప్తు అంశంపై కోర్టుదే నిర్ణయం అన్నారు. వివేకా హత్య కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు.. తదుపరి దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ వాదనలపై స్పందిస్తూ.. మీరు బస్ మిస్సయ్యారు.. ఛార్జిషీట్ ఇప్పటికే దాఖలైంది.. దర్యాప్తు జరుగుతున్న సమయంలో ఈ అంశాలను ట్రయల్ కోర్టులో ఎందుకు చెప్పలేదు? అని ప్రశ్నించింది.. కోర్టులో ఇలాగే అప్లికేషన్స్ వేస్తూ వెళ్తే.. ట్రయల్ పూర్తి కావడానికి దశాబ్ద సమయం పడుతుందన్నారు.. ఈ దశలో మేం చేసేది ఏముంది ?.. నిందితులపై ఇప్పటికే హత్యా నేరారోపణలు నమోదు చేశారు కదా? అని ప్రశ్నించింది సుప్రీంకోర్టు.

## 'క్రిబ్కో' ఛైర్మన్‌గా తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి!

- **క్రిబ్కో ఛైర్మన్‌గా తెలుగు వ్యాపారవేత్త**
- **ఏకగ్రీవంగా ఎన్నికైన వల్లభనేని సుధాకర్ చౌదరి**
- **మోహన్ స్పింటెక్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ కూడా**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

క్రిబ్కో (క్రిషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్) నూతన ఛైర్మన్‌గా తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి ఎన్నికయ్యారు. మొన్నటివరకు వైస్ ఛైర్మన్‌గా ఉన్న సుధాకర్ చౌదరి.. సోమవారం జరిగిన క్రిబ్కో ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలానే డాక్టర్ చంద్రపాల్ సింగ్ యాదవ్ వైస్ ఛైర్మన్ పదవిని దక్కించుకున్నారు. ఈ రెండు అత్యున్నత పదవులకు ఒకే నామినేషన్లు దాఖలు కావడంతో.. ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. నూతన ఛైర్మన్ సుధాకర్ చౌదరికి ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతం చేయడంలో సుధాకర్ చౌదరి, చంద్రపాల్ సింగ్ యాదవ్ విస్తృత అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు మంత్రులు ఎస్‌సీయూఐ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం గమనార్హం. బోర్డు సభ్యులు, ఇద్దరు మంత్రుల మధ్య చర్చల తర్వాత నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిసింది. కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్, ఉత్తరప్రదేశ్ సహకార మంత్రి జెపిఎస్ రాథోడ్ రెండు నామినేషన్లకు ఆమోదం తెలిపారు. వైస్ ఛైర్మన్ పదవికి గుజరాత్‌కు చెందిన మగన్‌భాయ్ పటేల్, బిపిన్ పటేల్ పేర్లు పరిశీలనకు వచ్చాయి. అయితే బిపిన్ చివరికి చంద్రపాల్ యాదవ్‌ను సిఫార్సు చేశారు. దాంతో వైస్ ఛైర్మన్ ఎన్నికకు మార్గం సుగమం అయింది.

వల్లభనేని సుధాకర్ చౌదరి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త. విజయవాడలోని ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో (1978-1986) పాఠశాల విద్యను పూర్తి చేశారు. బాబుజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ (1989-1993) నుంచి ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ టెక్నాలజీస్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ పట్టా పొందారు. మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ కూడా. ఆయన నాయకత్వంలో మోహన్ స్పింటెక్స్ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన వస్త్ర తయారీ కంపెనీగా ఎదిగింది. వస్త్ర పరిశ్రమ, సహకార రంగాలలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. సుధాకర్ చౌదరి ఫిబ్రవరి 2020 నుంచి క్రిబ్కోలో డైరెక్టర్‌గా ఉన్నారు. క్రిబ్కో ఎగ్జిక్యూటివ్ కమిటీ అండ్ ఆడిట్ కమిటీ సభ్యుడు కూడా. క్రిబ్కో ఏప్రిల్ 1980లో స్థాపించబడిన రసాయన ఎరువుల ఉత్పత్తి సంస్థ.



# వీటిని కలిపి తింటున్నారా.. చాలా డేంజర్!

**మన ఆరోగ్యానికి సంబంధించి మనం తీసుకునే ఆహారం ఎంతో ప్రభావం చూపుతోందన్న విషయం మనందరికీ తెలుసు.. బిజీ బిజీ జీవితాలతో ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టక చాలామంది పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. దీనికి చాలా కారణాలు ఉంటాయి. మంచి ఆహారం తీసుకోకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. అలాగే తీసుకునే ఆహారంలో కొన్ని కాంబినేషన్లు కూడా మన ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. కొన్ని సమయాల్లో కొన్ని ఆహార కలయికలకు దూరంగా ఉండాలని ఆరోగ్యనిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి కొన్ని ఫుడ్ కాంబినేషన్లు ఏంటో చూసేయండి...**

ప్రస్తుతం చాలామంది అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు. మీరు కూడా బరువు తగ్గే ప్లాన్ లో ఉంటే ఖచ్చితంగా ఈ ఆహార కలయికలకు దూరంగా ఉండాలి. ఈ రెండు పదార్థాలను కలిపి తినడం వల్ల మీ బరువు తగ్గడానికి బదులు పెరుగుతుంది. అంతే కాకుండా అనారోగ్యం పాలవడం గ్యారంటీ అవేంటో తెలుసుకుందాం..

**టీ లేదా కాఫీ - ప్రాసెస్ చేసిన స్నాక్స్ :**
టీ లేదా కాఫీతో ఒక విధమైన అల్పాహారం తీసుకోవడం ఒక సాధారణ అలవాటుగా ఉంటుంది. ఈ కలయిక అసిడిటీకి దారితీయడమే కాకుండా, బిస్కెట్లు, ప్రిజర్వేటివ్‌లను కలిగి ఉన్న కుకీల వంటి అధికంగా ప్రాసెస్ చేసిన స్నాక్స్ మీ శరీరానికి హానికరం. ముఖ్యంగా మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నప్పుడు.. డీప్‌ఫ్రైడ్‌లను మానేయాలి.

**చికెన్ - పప్పు :**
కొన్నిసార్లు చాలా ప్రోటీన్ మీ జీర్ణవ్యవస్థను గందరగోళానికి గురి చేస్తుంది. ఇది మీ తప్పు లేకుండా అనవసరంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. కావున, చికెన్, పప్పు వంటి ప్రోటీన్ ఆధారిత ఆహారాలను తీసుకోవాలనుకుంటే వాటిని విడిగా భోజనంలో తీసుకోండి. కలిపి తినకుండా ఉండటానికి ప్రయత్నించండి.

**వైట్ బ్రెడ్ - పెరుగు :**
తరచుగా, సమయాన్ని ఆదా చేయడానికి కొందరు అల్పాహారంగా శాండ్‌విచ్, గడ్డకట్టిన పెరుగు తింటారు. ఇవి మీ శరీరానికి ఎంతో హాని చేస్తాయి. వైట్ బ్రెడ్ అధిక గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే అది మీకు సరైనది కాదు. బరువు తగ్గాలనుకుంటే, వైట్ బ్రెడ్‌కు బదులుగా మల్టీగ్రెయిన్ లేదా బ్రౌన్ బ్రెడ్‌ను తీసుకోండి. కానీ, పెరుగుతో కలిపి ఎప్పుడూ తినకండి.

**పాలు - అరటిపండు :**
పాలు, అరటిపండు రెండూ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. వాటిలో అనేక పోషక ప్రయోజనాలున్నాయి. అయితే, వాటిని కలిపి తినడం వల్ల వాటి పోషక భాగం నాశనం అవుతుంది. బరువు కూడా పెరుగుతుంది. అందుకే అరటిపండు, పాలు విడివిడిగా తీసుకోవాలి. రెండింటి తినేందుకు కనీసం అరగంట గ్యాప్ ఇవ్వాలి.

**బొప్పాయి–పాలు/పెరుగు :**
బొప్పాయిలో పాలు, పెరుగు కలిపి ఎప్పుడూ తినకూడదు. ఇలా రెండింటిని కలిపి తింటే దగ్గు, తలనొప్పి, జలుబు వంటి సమస్యలు వస్తాయి. నారింజ రసం, నిమ్మ రసం, కాకరకాయ వంటి ఆహార పదార్థాలను కూడా బొప్పాయితో కలిపి తినకూడదు.

**చేపలు–పెరుగు :**
పెరుగు, చేపల మిశ్రమం ఆరోగ్యానికి హానికరం. ఆయుర్వేదం ప్రకారం, చేప, పెరుగు వ్యతిరేక ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇది శరీరంలో అసమతుల్యతను కలిగిస్తుంది. ఇది అలెర్జీలు, దద్దుర్లు, ఇతర చర్మ సమస్యలను కలిగిస్తుంది.





# తేన్పులు.. డేంజర్ బెల్స్



అతిగా తేన్పులు రావడం అనారోగ్య కారకం అంటున్నారు నిపుణులు. మామూలుగా తేన్పులు రావడం పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ పదే పదే తేన్పులు వస్తున్నాయంటే డేంజర్ బెల్స్ మోగినట్టే. అసలు తేన్పులు తరుచుగా రావడానికి కారణం ఏమిటి? ఈ కథనంలో తెలుసుకుందాం..


**తేన్పులు ఎందుకొస్తాయి?**
మనం తినేటప్పుడు, తాగేటప్పుడు కొంత గాలి లోనికి వెళ్తున్నది. ఈ గాలి జీర్ణాశయం పై భాగంలో నిలిచిపోతుంది. జీర్ణాశయం కాస్త ఉబ్బుతుంది. ఆ సమయంలో అన్నవాహిక, జీర్ణాశయం కలిసే చోట కండరం కాస్త తెరచుకుంటుంది. దీంతో గాలి తేన్పుల రూపంలో బయటకు వస్తుంది. తేన్పులు రావడం వల్ల జీర్ణాశయానికి ఎలాంటి ఇబ్బందులు కలగవు. జీర్ణాశయంలోని జీర్ణ రసాలు గొంతులోకి రావడం వల్ల తేన్పులు అతిగా వస్తాయి. వేగంగా తినడం, తాగడం, కూల్ డ్రింక్స్ తీసుకోవడం, ధూమపానం, మద్యపానం కారణంగా తేన్పులు ఎక్కువగా వస్తాయి. తేన్పులు రావడానికి ఇతర కారణాలు..

తీసుకున్న ఆహారం సరిగా జీర్ణంకాని సమయంలో తేన్పులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. అజీర్ణం కారణంగా ఛాతిలో మంట, కడుపు ఉబ్బరం, తేన్పులతో పాటు అనారోగ్యంగా అనిపిస్తుంది. గొంతులోకి ఘాటైన ఆమాల్లు వచ్చి మంట ఏర్పడుతుంది. తిన్న తర్వాత కనీసం మూడు గంటలకు నిద్రపోవడం వల్ల జీర్ణ సమస్యలు రావు. స్పైసీ, ఫ్యాటీ ఫుడ్స్ తీసుకోవడం వల్ల కూడా అజీర్ణం ఏర్పడుతుంది.

**ఆమ్లాలు పైకి రావడం**
జీర్ణాశయంలోని ఆమ్లాలు అన్నవాహికలోకి ఎగదన్నుండం వల్ల గుండెల్లో మంట ఏర్పడుతుంది. దగ్గు, ఎక్కిళ్లు వస్తుంటయి. నోటి దుర్వాసన, ఉబ్బరం, అనారోగ్యం కలుగుతుంది. కాఫీ,టమాటాలు, ఆల్కహాల్, చాక్లెట్, కొవ్వు పదార్థాలు తీసుకోవడం ఎసిడిటీ ఏర్పడుతుంది.

**గ్యాస్ట్రిటిస్**
గ్యాస్ట్రిటిస్ కారణంగా కడుపు ఎగువ భాగంలో నొప్పితో పాటు అసౌకర్యం కలుగుతుంది. భోజనం తిన్న వెంటనే కడుపు నిండినట్లు అనిపిస్తుంది. వికారం, వాంతులుతో పాటు ఆకలి తగ్గుతుంది. వారం రోజుల కంటే ఎక్కువ కడుపునొప్పి, అజీర్ణ సమస్యలు తలెత్తితే డాక్టర్ ను సంప్రదించాలి. అజీర్ణం కారణంగా పొట్టలో పుండ్లు ఏర్పడుతాయి. దీనిని గ్యాస్ట్రిక్ అల్సర్స్ అనికూడా పిలుస్తారు. పేగు గోడలలో పుండ్లు ఏర్పడుతాయి. కడుపులో పుండ్లు ఏర్పడ్డం వల్ల మంట, నొప్పి ఏర్పడుతుంది.

**ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**
అసలు తేన్పులు రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.. చాలా మంది గబాగబా భోజనం ముగిస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల తేన్పులు వచ్చే చాన్స్ ఉంది. కాబట్టి నెమ్మదిగా ఆహారం తీసుకోవాలి. ద్రావణాలు కూడా చాలా నెమ్మదిగా తాగాలి. బ్రోకలీ, క్యాబేజీ, బీన్స్, పాల ఉత్పత్తులకు కాస్త దూరంగా ఉండటం మంచిది. సోడా, బీర్ లాంటి ఫ్రిజ్ లో పెట్టిన కూల్ డ్రింక్స్ కు దూరంగా ఉండాలి. ధూమపానం చేయొద్దు.



# ఈ ఫుడ్ తీసుకోండి..
## ఎముకలు ఉక్కులా దృఢంగా ఉంటాయి

**కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు ఇప్పుడు సర్వ సాధారణమైన సమస్యగా మారిపోయింది. ఎముకల్లో పటుత్వం లేక పోవడం వల్లే ఇటువంటి సమస్యలు వస్తున్నాయి. అయితే కొన్ని రకాల ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఎముకలు ఉక్కులా దృఢంగా ఉంటాయి. ఎముక పటుత్వానికి అవసరమైన కాల్షియం కూడా అందుతుంది. కాల్షియంతో పాటు, జింక్, భాస్వరం, రాగి మొదలైనవి కూడా వాటి లోపల ఉంటాయి.**



**ఈ ఫ్రూట్స్ తరుచూ తీసుకోండి**
జామ, నారింజ వంటి పండ్లలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల జామపండులో 18మిల్లీగ్రాముల కాల్షియం ఉంటుంది. యాపిల్స్, అరటిపండ్లు మరియు నారింజలు కూడా ఈ ఖనిజాన్ని అందిస్తాయి. ఇతర సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడుతుంది. కొల్లాజెన్ ఎముకల బలాన్ని కాపాడుతుంది. బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు వంటి నట్స్‌లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది.

**నువ్వులు ఎముకలకు ఎనర్జీ**
నువ్వులు, అవిసె గింజలలో కాల్షియం, మెగ్నీషియం ఫాస్పరస్ ఉంటాయి. ఎముకలను బలోపేతం చేయడానికి ఈ ఖనిజాలు అవసరం. వీటిని మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీ ఎముకలను మందంగా మార్చుకోవచ్చు. కూరగాయలతో ఎముకలు కూడా బలపడతాయి. బచ్చలికూర, మెంతులు మరియు బ్రోకలీ వంటి ఆకుకూరలు విటమిన్ కె, కాల్షియం మరియు మెగ్నీషియంను అందిస్తాయి. ఇవి ఎముకల సాంద్రత బలాన్ని పెంచుతాయి.

**పాలు, పెరుగు, పనీర్**
ఎముకల బలహీనతకు చికిత్స చేయడానికి పాల ఉత్పత్తులు ప్రజల మొదటి ఎంపిక. పాలు, పెరుగు మరియు చీజ్ కాల్షియం నిక్షేపాలను కలిగి ఉంటాయి. ఇవి బోలు ఎముకల వ్యాధి నుండి రక్షణ కల్పిస్తాయి మరియు పెరుగుదలకు అవసరం.

**బీన్స్, పప్పులు, ధాన్యాలు**
శాఖాహారంలో కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు ఉంటాయి. పప్పుధాన్యాలు, పప్పుధాన్యాలు మరియు ధాన్యాలు జాబితాలో తర్వాతి స్థానంలో ఉన్నాయి. రాజ్మా, చిక్పీస్ మరియు కాయధాన్యాలు వంటి పప్పులలో ప్రోటీన్, కాల్షియం మరియు మెగ్నీషియం ఉన్నాయి, ఇవి ఎముకలను బలోపేతం చేస్తాయి.

**ఎముకలకు సోయా ఉత్పత్తులు**
టోఫు, సోయా మిల్క్, సోయాబీన్స్ బోలు ఎముకల వ్యాధి రాకుండా కాపాడతాయి. సోయా ఉత్పత్తులలో ప్రోటీన్ మరియు క్యాల్షియం సమతుల్యంగా ఉంటాయి. ఈ ఆహారాలన్నీ ఎముకల సాంద్రతను పెంచడంలో సహాయపడతాయి.

**కాల్షియం అధికంగా ఉండే మాంసాహారం**
గుడ్లు మరియు చేపలు కాల్షియం యొక్క మంచి వనరులు. ఎముకలకు అవసరమైన ఇతర పోషకాలు కూడా ఇందులో ఉన్నాయి. వాటిలాగే, విటమిన్ డి శరీరంలో కాల్షియం శోషణను పెంచుతుంది.





# ఆ పరిస్థితులే నిర్మాతగా మార్చాయి

''చిత్రపరిశ్రమలో నాలా ఎవరు ఇబ్బందిపడకూడదనే నిర్మాణ సంస్థను స్థాపించాన''ని అంటోంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో అగ్రహీరో మహేశ్ బాబుతో కలిసి తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలతో నటిగా అలరిస్తూనే.. నిర్మాతగా కూడా రాణిస్తోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంక.. పర్పుల్ పెబుల్ పిక్చర్స్ పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించడానికి అప్పటి బాలీవుడ్ పరిస్థితులే కారణమని అంటోంది. ''2000 సంవత్సరంలో నేను మిస్ వరల్డ్ కిరీటం సొంతం చేసుకున్నా. మంచి అవకాశాల్ని అందుకున్నా. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్‌లో పరిస్థితులు అర్థమయ్యాయి. సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చిన వారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకున్నా. తరతరాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న వారు పెద్ద స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చిన వారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ.. నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని విజయాలు సాధించాను. ఆ సమయంలోనే సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చే వాళ్లను ప్రోత్సహించడానికి 2015లో సొంతంగా నిర్మాణ సంస్థను ప్రారంభించాన''ని చెప్పుకొచ్చింది.





# బాలీవుడ్ సీక్వెల్‌లో రష్మిక మందన్న..

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ సత్తా చాటుతున్న అగ్ర కథానాయిక రష్మిక మందన్న. ప్రజంట్ బాలీవుడ్ టూ టాలీవుడ్ వరకు చక్రం తిప్పుతుంది. వరుస హిట్ అందుకుంటు ప్రజంట్ టాప్ పోజిషన్‌లో ఉంది. ముఖ్యంగా హిందిలో కూడా బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో ధూసుకుపోతుంది. గత ఏడాది ఛావా సినిమాతో హిందీ ఇండస్ట్రీలో బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్న రష్మిక, ప్రస్తుతం హారర్ కామెడీ ఎంటర్టైనర్ తమాలో నటిస్తున్నారు. తాజాగా ఆమె మరో పెద్ద సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

2012లో విడుదలై భారీ విజయాన్ని సాధించిన కాక్‌టెయిల్ సినిమాకు సీక్వెల్ రూపొందుతోంది. అసలు సినిమాలో సైఫ్ అలీ ఖాన్, దీపికా పడుకోన్, డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో నటించి, ప్రేమ–స్నేహం–అనుబంధాలపై ఆధారపడి వచ్చిన ఈ కథ యువతను బాగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే ఫ్రాంచైజ్‌లో 'కాక్‌టెయిల్ 2'ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ లీడ్ రోల్స్‌లో కనిపించనున్నారు. కాగా సమాచారం ప్రకారం రష్మిక ఈ సినిమాలో భాగమవుతున్నట్లు చాలాకాలంగా వార్తలు వినిపిస్తున్న ప్పటికీ, అధికారికంగా ఎలాంటి ధృవీకరణ రాలేదు. కానీ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన విషయాన్ని ప్రకటించారు. ఆన్-లొకేషన్ ఫోటోలను షేర్ చేస్తూ, "అపరిమితమైన వినోదానికి సిద్ధంగా ఉండండి" అంటూ క్యాప్షన్ జోడించారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో కాక్‌టెయిల్ 2 ప్రేక్షకుల ముందుకు రానున్నది. దీంతో బాలీవుడ్ ఆడియెన్స్‌లో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది.

# కిష్కింధపురి చూసి లోకేష్ కనగరాజ్ ఫోన్..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లేటెస్ట్ థ్రిల్లింగ్ బ్లాక్ బస్టర్ 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రాన్ని కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. అద్భుతమైన ప్రిమియర్స్ తో మొదలైన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన శాండీ మాస్టర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

లియో, లోక ఇప్పుడు కిస్కిందపురి వరుస విజయాలు అందుకున్నారు కదా ఎలా అనిపిస్తుంది?
చాలా ఆనందంగా ఉంది. ముందుగా డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ గారికి థాంక్స్ చెప్పాలి. ఆయన లియోలో నాకు ఆ క్యారెక్టర్ ఇవ్వకపోతే ఈ జర్నీ మొదలయ్యేది కాదు.

చిన్నప్పుడు అందరూ నా కళ్ళను చూసి ఆటపట్టించేవారు. 'డెత్ గోట్ ఐస్' అంటూ టీజ్ చేసేవారు. అయితే ఇప్పుడు అదే నాకు చాలా ఆనందం ఇచ్చింది. నిజంగా నాకు అలాంటి కళ్ళు లేకపోతే లోకేష్ ఆ క్యారెక్టర్ కి నన్ను ఎంపిక చేసేవారు కాదు. విక్రమ్ సినిమాలో ఒక సాంగ్ కి కొరియోగ్రఫీ చేశాను. అప్పుడే ఆయన లియోలో క్యారెక్టర్ గురించి చెప్పారు. లియో తర్వాత నాకు చాలా క్యారెక్టర్లు వచ్చాయి. అన్ని ఒకే తరహ సైకో పాత్రలు చెప్పేవారు. ఇలాంటి సమయంలో లోక, కిష్కింధపురి డిఫరెంట్ సినిమాల్లో డిఫరెంట్ క్యారెక్టర్స్ తో వరుస విజయాలను అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

**హైదరాబాద్ కి ఎప్పుడు ఎంట్రీ ఇచ్చారు?**
ఓంకార్ చేసిన చాలెంజ్ 3 షో తో హైదరాబాద్ కు వచ్చాను. పోతే పోనీ పోరా పాట నాకు చాలా మంచి ఫేమ్ తీసుకొచ్చింది. నాకు హ్యూమర్ సెన్స్ ఉన్న క్యారెక్టర్స్, డాన్స్ పెర్ఫార్మన్స్ అంటే చాలా ఇష్టం.

**కిస్కింధపురిలో మీ క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు మిమ్మల్ని ఆకట్టుకున్న ఎలిమెంట్స్ ఏమిటి?**
డైరెక్టర్ కౌశిక్ ఈ కథని అద్భుతంగా చెప్పారు. అందులో నా క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఆ క్యారెక్టర్ గురించి ఎక్కువ రివిల్ చేయకూడదు. అది ఒక సర్ప్రైజ్ లాగా ఉంచాము. ఈ క్యారెక్టర్ కోసం దాదాపు ఏడు గంటల పాటు టెస్ట్ షూట్ చేశాం. అది డైరెక్టర్ గారికి చాలా నచ్చింది. ఇలాంటి యూనిక్ క్యారెక్టర్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.


కిస్కింధపురితో మీరు అందుకున్న బెస్ట్ కాంప్లిమెంట్?
ఆడియన్స్, ఫ్రెండ్స్ నుంచి చాలా మంచి అప్లోజ్ వచ్చింది. అలాగే పా రంజిత్ గారు, లోకేష్ కనకరాజు గారు సినిమా చూసి చాలా అప్రిషియేట్ చేశారు. చాలామంది ఆడియన్స్ థియేటర్స్ లో నాకు క్యారెక్టర్ వచ్చినప్పుడు గ్రేట్ రెస్పాన్స్ ఇవ్వడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

**డైరెక్టర్ గారు ఈ క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు ఏమైనా రిఫరెన్స్ ఇచ్చారా?**
నాకు రిఫరెన్స్ తీసుకోవడం ఇష్టం ఉండదు. అయితే గతంలో సూర్య గారు చేసిన ఒక సినిమా ని రిఫరెన్స్ గా ఇచ్చారు. అయితే ఆ క్యారెక్టర్ కి ఈ క్యారెక్టర్ కి సంబంధం లేదు. చాలా కొత్తగా ఈ క్యారెక్టర్ ని ప్రజెంట్ చేయడం జరిగింది.

**ప్రొడక్షన్ హౌస్ సపోర్టు ఎలా ఉంది?**
- సాహు గారు చాలా స్వీట్ ప్రొడ్యూసర్. ఒక ఫ్యామిలీలో ఒక బ్రదర్ లాగా చూసుకున్నారు. చాలా అద్భుతంగా ట్రీట్ చేశారు. వారి ప్రొడక్షన్స్ లో వర్క్ చేయడం చాలా ఆనందించింది.

**యాక్టర్ గా కొరియోగ్రాఫర్ గా ఏ జర్నీ మీకు ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది?**

కొరియోగ్రఫీ నా బేస్. కచ్చితంగా కొరియోగ్రఫీ చేస్తాను. అయితే ప్రస్తుతం నేను యాక్టింగ్ మీద ఫోకస్ చేశాను. ఈ రెండు బ్యాలెన్స్ చేస్తూ చేయాలని ఉంది. నాకు దర్శకత్వం మీద కూడా ఆసక్తి ఉంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది.





**మీరు ఒక సినిమాని ఎంచుకోవాలంటే దేనికి ప్రాధాన్యత ఇస్తారు?**

కథ బాగుండాలి. మంచి కథ అయితే తప్పకుండా చేస్తాను. కథ బాగుంటే ఆటోమేటిక్గా క్యారెక్టర్ కూడా బాగుంటుంది. అన్నిటికీ పునాది మంచి కథ.

**కొత్తగా చేస్తున్న ప్రాజెక్ట్స్ గురించి?**
పా రంజిత్ గారి నిర్మాణంలో హీరోగా ఒక సినిమా చేస్తున్నాను. మలయాళం లో కథనార్ లో ఒక కీలక పాత్ర చేస్తున్నాను. ఓజీలో ప్రమోషనల్ సాంగ్ కి కొరియోగ్రఫీ చేశాను.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465